

శ్రీ షిర్డీ సాయిబాబా



శ్రీ ఎక్కిరాల భరద్వాజ మాస్టర్



శ్రీ సుబ్బరామయ్య గారు



శ్రీ వెంకయ్యస్వామి



శ్రీ దర్గాస్వామి


# శ్రమతో సేవ – సేవతో కైవల్యం మాసపత్రిక

వ్యవస్థాపకులు: శ్రీ సాయి మాస్టర్ సేవా ట్రస్ట్
ఎడిటర్: గొర్తి సాయి సుబ్రహ్మణ్యం

**నేపథ్యం: సన్మాత్రాయ నమః : విశేష ప్రయత్న శీలి**

సంపుటి: 01 సంచిక: 09
31-March-2018


శ్రీ సుబ్బరామయ్య సార్ జీవిత విధానం ద్వారా బోధించిన "శ్రమతో సేవ – సేవతో కైవల్యం" ను అనుసరించి మా జన్మలు ధన్యము గావించుటకు ఈ మాసపత్రికను ప్రారంభిస్తున్నాము. శ్రీ సుబ్బరామయ్య సార్ మనకందించిన అనుభవాలను, సాంగత్య స్మృతులను, సార్ ఆచరించి వాదా బోధించిన అమూల్య విషయాలను స్మరించుకొనుటకు, మహాత్ములు బోధించిన సత్సంగ, సద్గ్రంథ పఠనలకు ప్రేరణగా ఈ మా చిన్న సేవ.

<u>**గమనిక**</u> : ఎవరైనా ఈ e-magazine లో తమ వ్యాసాలను, అనుభవాలను పంచుకోదలిచినవారు saimaster.sevatrust@gmail.com కు e-mail చేయగలరు

**శ్రీ సుబ్బరామయ్య సార్ ప్రవచనం**

http://saimastersevatrust.org/Speeches/KatoraNiyamaPalana.mp3

సార్ ఈ సత్ సంగం లో సార్ నియమ పాలన యొక్క ప్రాముఖ్యాన్ని, భగవంతుని మెప్పించే రీతి జీవనాన్ని, అది సాధ్యమయ్యే మార్గాన్ని దానిలో అవాంతరాలను తొలగిమ్చుకొనే మెళకువలను తెలుపుతారు.

**సపితా స చ మే మాతా స బంధుశ్చ స చ దేవతా | సంసార మోహనాశాయ తస్మై శ్రీ గురవే నమః ||**

శ్రీమతి గొర్తి లక్ష్మి గారు (దమ్మపేట) తమకు శ్రీ సాయి, శ్రీ భరద్వాజ మాస్టర్, శ్రీ వెంకయ్య స్వామి కృప పొందేటట్లు శ్రీ సుబ్బరామయ్య సార్ ఎలా మార్గదర్శకం చేసారో, ఎలా తమ పిల్లల్ని సమాజానికి ఉపయోగపడే జీవిత విధానంలో సంస్కరిస్తున్నారో ఇక్కడ పంచుకుంటున్నారు.

## తొలి పరిచయం :

మొదట శ్రీ సాయిబాబా అనుగ్రహం, పరిచయం 1980-81లో శ్రీ చింతా లక్ష్మీనారాయణగారి సతీమణి ద్వారా శ్రీ సాయిబాబా చరిత్ర ( శ్రీ సాయి లీలామృతం) గూర్చి, శ్రీ భరద్వాజ మాస్టారి గురించి వినడం జరిగింది. అదీ ఒక చిక్కు పరిస్థితిలోనే. మా పెద్దబ్బాయి సాయి సుబ్రహ్మణ్యంకు చిన్నతనంలో గుండెలో చిల్లు ఉందని ఆపరేషన్ చేయాలని ఆ సమయంలో తెలిసి బాధపడుతుంటే బాబా గూర్చి చెప్పి చరిత్ర పారాయణ చేస్తే మేలవుతుందని చరిత్ర కూడా వారు ఇచ్చారు. తర్వాత మద్రాసులో ఆపరేషన్ చేయించాము. అచ్చట మూడు వారాలు ఉన్న సమయంలో బాబా ఫోటో పెట్టి మొదట మా వారు పారాయణ చేసారు. బాబా దయ వలన ఆపరేషన్ సజావుగా జరిగి క్షేమంగా ఇంటికి వచ్చాము. అప్పటికి బాబాపై నాకు అంత విశ్వాసం, శ్రద్ధ కలగలేదు. అప్పుడు చిన్న పల్లెటూరులో ఉండేవారము. అప్పటికి నాలుగు నెలల తర్వాత మా బాబుకు ఒకసారి హై టెంపరేచర్ వచ్చి కళ్ళు తేలవేస్తే ప్రమాద పరిస్థితిలో బయటపడి ఏమీ తోచక 'బాబా, బాబా' అని ప్రార్థిస్తూ బాగుంటే పారాయణ చేస్తానని మ్రొక్కుకోగానే చక్కబడటంతో మొదలుపెట్టి నాలుగు సప్తాహాలు నెలరోజులూ సాయి లీలామృతం పారాయణ చేయడంతో శ్రీ సాయినాధుని పై భక్తి. విశ్వాసం మొదలైనాయి. బాబా ఆరతులు, భజన చేసుకునేటట్లు బాబానే అవకాశం కల్గించారు.

## సత్సంగం ప్రసాదించటం:

దమ్మపేటకు ఉద్యోగరీత్యా వచ్చాక 1986 లో శ్రీ లక్ష్మీనారాయణ గారి దంపతులతో పాటు ఒంగోలు లో శ్రీ భరద్వాజ మాస్టారిని దర్శించే భాగ్యం కలిగింది. శ్రీ భరద్వాజ మాస్టారి గారి జన్మదిన సందర్భంగా వారి పూజలో పాల్గొని మా ఇద్దరి పిల్లలతో తిరిగి వచ్చేటప్పుడు మా ఊరులో శ్రీ మాస్టారిని బాబా గూర్చి చెప్పుటకు రమ్మని ఆహ్వానించాము. శ్రీ మాస్టారు "మీరు మీ ఊరి వారితో సత్ సంగం చేసు కోండమ్మ, వస్తాను"


శ్రీ షిర్డీ సాయిబాబా


శ్రీ ఎక్కిరాల భరద్వాజ మాస్టర్


శ్రీ సుబ్బరామయ్య గారు


శ్రీ వెంకయ్యస్వామి


శ్రీ దర్గాస్వామి

అన్నారు. నాకెవ్వరూ తెలియదంటే నలుగురు చిన్నపిల్లల్ని పిలచి బాబా కథ ఒక్కటి చెప్పి, బొరుగులు ప్రసాదం పెడితే ఆదే సత్సంగం అవుతుందన్నారు. చిత్రంగా మా ఇంటి ప్రక్కనే అంగనవాడి స్కూల్ ఉండటం అదేరీతి స్కూల్ అయిపోయే టైం లో పిల్లల్ని పిలచి కొంచెం ప్రసాదం పెట్టడం, దాని ద్వారా వారి తల్లిదండ్రులకు బాబా సత్సంగం పరిచయం కావటం జరిగింది. మా ఊరిలో వారికి బాబా ఎన్నో దివ్య అనుభవాలు ఇచ్చారు. అట్లా శ్రీ మాస్టారి ఆశీస్సులతో సత్సంగం ప్రారంభమై మొదట ఆడవాళ్ళు, తరువాత అందరూ పాల్గొనటం వలన మందిరం కూడా ఏర్పడింది. నిత్యసత్సంగం అప్పటినుండి జరుగుతునే ఉంది.

**భగవాన్ శ్రీ శ్రీ శ్రీ వెంకయ్యస్వామి, శ్రీ సుబ్బరామయ్య సార్ పరిచయం:**

శ్రీ సాయి మాస్టర్ దయ వల్ల మాస్టారి వ్రాసిన చరిత్రలన్నీ పారాయణల వలన గురుగీతలో శ్రీ గురువు యొక్క తత్త్వము, భావయుక్తంగా పూజ ఎలా చేయాలో, సద్గురువు, అసలైన మహనీయులు ఎలా ఉంటారో అవగాహన కల్గించారు. మొదటిసారిగా శ్రీ వెంకయ్యస్వామి వారి చరిత్ర పరిచయం శ్రీ దత్త సాంప్రదాయంలోకి తీసుకువచ్చారు. శ్రీ సాయిబాబా పత్రికలో మొదటిసారిగా శ్రీ వెంకయ్యస్వామివారు విజయనగరంలో సమాధి అనంతరం భౌతిక దర్శనం ఇచ్చిన సంఘటన చదివి పులకించటం జరిగింది. శ్రీ వెంకయ్యస్వామి వారి చరిత్ర పంపమని మని-ఆర్డర్ పంపితే, స్వామి చరిత్రతో పాటు, బోధామృతం కూడా శ్రీ పెసల సుబ్బరామయ్య గారు పోస్టులో పంపారు. స్వామి గొప్పదనం కొంత వీటన్నిటితో హృదయగతం అయ్యాక 1990 లో మొదటిసారిగా గొలగమూడి దర్శించాము. ఒంగోలులో శ్రీ సాయినాధుని విగ్రహ ప్రతిష్ట చేసిన శ్రీ గులాబ్ బాబా గారిని దర్శించుకుని శ్రీ వెంకయ్యస్వామి వారి సమాధిని దర్శించటం జరిగింది. అప్పుడే మొదటిసారిగా శ్రీ సుబ్బరామయ్య సార్ ని దర్శించటం జరిగింది.

**సత్ సంగము లో జాగ్రత్తలు, అపరిగ్రహం, ఆహార నియమం –అవ్యక్త ప్రేరణ, ఆచరణ :**

సార్ వ్రాసిన శ్రీ అవధూత బోధామృతం నాకు, సత్సంగంలో వారికి మార్గదర్శకమైంది. దానిలో శ్రీ స్వామి వారి ఆచరణ వివరిస్తూ వారు వ్రాసిన విధంగా కార్యదీక్ష (పని అయితేనే గంజి ముట్టాలని) శ్రీ స్వామివారు ఎంత శ్రద్ధగా చేసారో మనము శ్రద్ధగా మహనీయుల చరిత్ర పారాయణ చేయాలనిపించేది. ఎంత పడితే అంత, ఎక్కడ పడితే అక్కడ, ఎవరు పెడితే అది తినటం గూర్చి, అట్లా దాంట్లో వివరించిన బోధలు, ఆ పుస్తకం హృదయగతమవుతూ ఆ పుస్తకాన్ని మరలా మరలా మననం జరిగేది. ఆ పుస్తకం ద్వారానే సార్, శ్రీ స్వామి ఇవన్నీ పరోక్షంగా చేయించటమే గాక సత్సంగం చేసే వారు తీసుకోవలసిన జాగ్రత్తలు, అది సజావుగా జరుగుటకు అవసరమైన మార్పులు చిత్రంగా, శ్రీ సార్ లెటర్ల ద్వారా సరైన సమయానికి అవ్యక్తంగా అందేవి.

ఒక సమయంలో సత్సంగంపై మా ఊళ్ళో వాళ్ళకే గాక, చుట్టుప్రక్కల ఎందరో ఊళ్ళ వారికీ శ్రద్ధ కలిగి చుట్టుప్రక్కల గ్రామాలకు కూడా వెళ్లి సత్సంగం చేస్తుండే దానిని. అప్పుడు అచ్చట భోజనం వాళ్ళింట్లో చేస్తుండే దానిని. అంతేగాక వారి కృతజ్ఞత కొద్దీ ఇచ్చిన ప్రసాదాలు పిల్లలకు ఇవ్వడం, జాకెట్ గుడ్డలలాంటివి ఏమి చేయాలో తోచక తెచ్చి ఇంట్లో ఉంచటం జరిగేది. ఒక సందర్భంలో అనుకోకుండా సార్ వద్దనుండి ఒక లెటర్ వచ్చింది. దాంట్లో "రాజద్రోహం అంటే రాజు లేదా గురువు యొక్క భక్తులు, సేవకులు అయిన వారి సొమ్మును మనం స్వీకరించటం, దానితో మనం అన్ని రూపాలలోని గురువుకు ఎంతో ఋణపడతామని" ప్రస్తావిస్తూ గుజరాత్ లో వుండే వేణుగోపాల్ గారికి ఉద్యోగధర్మం గురించి వ్రాస్తూ చిత్రంగా ఎందుకో "మీకు పంపాలనిపించి పంపానని" వ్రాసారు. అప్పటి నా పరిస్థితికి అది స్వామి సందేశం అనిపించింది. అప్పటినుండీ ఎచ్చటకు వెళ్ళినా ఏమీ స్వీకరించేదానిని కాదు. ఇంట్లో ఉన్న ఎన్నో జాకెట్ గుడ్డలు మొ!! పేదలకు పంచటం, ఊళ్ళో వాళ్ళు సైతం ఇచ్చే ఎన్నో పళ్ళు (మామిడిపళ్ళు) మొ!! కూడా మా పిల్లలకు పెట్టకుండా ఆకలితో ఉండే జీవులకు, భిక్షవారికి సాయినాధుని రూపాలుగా ఇవ్వటం చేసేదానిని. సత్సంగం చేసుకొని శ్రీ మాస్టారి ఆశీస్సులు సద్వినియోగమవటానికి ఈ అపరిగ్రహం ఎంత ముఖ్యమో తర్వాత గానీ శ్రీ సార్ సూచన, సందేశంలో బోధపడలేదు. ఆచరణలోకి రాలేదు. సార్ లెటర్ తో ఇచ్చిన సందేశం వలన అంతకుముందు నుండి అవధూత బోధామృతంలో మరలా మరలా సూచించే బోధ "ఎవ్వరి దగ్గర పడితే ఎంత పడితే అంత తినటం సాధకులకు తగదు" అన్నది, "విమర్శలు వింటే గంజి క్రింద పెట్టు" అన్నది,"స్వామి సేవకు తగము" అన్నవి అన్నీ హృదయంలో సమన్వయమై బయట ఊళ్లకు వెళ్ళినప్పుడు తినటం వల్లనే తరువాత బాబాపై సరిగా మనస్సు నిలప లేకపోవటం, అనవసరపు ఋణానుబంధాలు, చికాకులలో చిక్కుకోవటం జరుగుతున్నాయని గుర్తింపు కలిగి అప్పటినుండి బయట తినటం, ఇతరులు ఇచ్చినవి, వండినవి తినటం మానేయటమైనది. మా చిన్నబ్బాయికి (శివకు) శ్రీ సార్ స్వయంగా



శ్రీ షిర్డీ సాయిబాబా



శ్రీ ఎక్కిరాల భరద్వాజ మాస్టర్



శ్రీ సుబ్బరామయ్య గారు



శ్రీ వెంకయ్యస్వామి



శ్రీ దర్గాస్వామి

చాలా స్పష్టంగా లెటర్ లో వ్రాసిన, చేసిన సూచన కూడా దీన్ని బలపరచటంతో అప్పటినుండి మా ఇద్దరిచే బయట తినకుండా ఉండే నియమం శ్రీ సార్ అలా ఆచరింప చేసారు.

**స్వామి కృపకు మార్గాంతరము– ఆచరణ సౌలభ్యం**

తర్వాత కొద్దిరోజులకు అనుకోకుండా గొలగమూడి వెళ్ళినప్పుడు సార్ సత్సంగం చెబుతూ పులినోట బడ్డ వేట అని వివరిస్తూ స్వామి వంటి సద్గురువు కృప పొందటం లోనే మన కృషి ఉంటుంది. ఆయన కృప ఉంటే సర్వమూ ఆయన చేస్తారు, బాధ్యత ఆయనది అన్నారు. నేను స్వామి కృప ఎలా కలుగుతుంది సార్ అంటే "మీరు నెలనెలా గొలగమూడి వచ్చి స్వామిని దర్శించుకోండమ్మా, స్వామికృప కలుగుతుంది" అన్నారు. సరే సార్ అని మరునెల గొలగమూడి వెళ్లి మూడు రోజులు ఉండి స్వామి అన్నశాలలో తిన్నాను. ఇంటికి వెళ్ళాక ఆ అన్నం శరీర ఆరోగ్యానికి పడక అనారోగ్యమైంది. ఇంక ఇలా నెలనెలా అయితే ఇబ్బందని సార్ కు నేనింక రాలేను సార్ ఇలా అనారోగ్యమైందని వ్రాసాను. సార్ ప్రత్యుత్తరంలో "అమ్మా! మీకు బయట తినటం వల్లనే కదా ఇబ్బంది వచ్చింది. మీరు వండుకోవడానికి నేను ధ్యానం చేసుకునే రూమ్, శ్రీ శ్రీ శ్రీ మాస్టర్ (ఫోటో రూపంలో) ఆసీనులైన రూమ్ మీరు రాగానే తాళం ఇచ్చి వేస్తాను. గ్యాస్ స్టవ్ కూడా స్వామి మీ కోసం పంపినట్లు వచ్చింది. కొన్ని గిన్నెలు తెచ్చుకు రండి ఇచ్చట వండుకుని తిని స్వామిని సేవించుకోండి. స్వామి సేవలో ఇబ్బంది వస్తే ఆ ఇబ్బంది తొలగించుకునే మార్గం చూసుకుని సేవ చేసుకోవాలి కానీ స్వామి సన్నిధిని వదులుకోకండి. స్వామిని నెల నెలా దర్శించుకోవటం చాలా గొప్ప సేవ, పుణ్యకార్యం అని వ్రాసారు.

అలానే నెల నెల దర్శించుకుంటూ సార్ ఇచ్చిన రూమ్, ఇప్పటికీ తరచూ వచ్చే భక్తులకు కేటాయించిన రూమ్ లో వండుకు తింటూ ఉండేదానిని. అప్పటిలో ఆర్థిక ఇబ్బందిగా ఉంటే సార్ "అవసరమైతే నేను నెలకు 500 రూపాయలు ఇస్తాను. మీరు తర్వాత ఇద్దురు. కానీ రావటం మానకండి. ఇది చాలా గొప్ప సేవ" అని వ్రాసారు. కొద్ది రోజులలోనే మా పెద్దబ్బాయికి M.Sc.లో సీట్ వచ్చి 5000 Rs స్టైఫండ్ వచ్చేది. ఒకసారి మా పెద్దబ్బాయితో నెలనెలా 1000 రూపాయలు మీ అమ్మగారికి గొలగమూడి ప్రయాణానికి ఉంచేయి అని చెప్పారు. అప్పటిలో ఆ ఇబ్బంది తొలగించి స్వామి రప్పించుకునే వారు.

**బాధ్యత – శరణాగతి:**

తరువాత వాడికి జాబు లో చేరాక శని, ఆదివారాలు శెలవవడంతో తరచూ మా పెద్దవాడు వస్తూ ఉండటం జరిగేది. తర్వాత వాడికి కొంత అనారోగ్యం రావటం (అది బయట తినటం వల్ల కావటం) నన్ను అచ్చట ఉంచి సమయానికి ఇబ్బంది లేకుండా చేసి గొలగమూడి చేర్చి కొన్ని నెలలు అచ్చట ఉంచటం జరిగింది. తరువాత వాడి Ph.D. తో పాటు అనుకోని రీతిన నన్ను కూడా మద్రాసులో ఎవ్వరితో సంబంధం లేకుండా నిరంతరం భగవంతునిపై, స్వామిపై ఆధారపడేలా చేసి నిరంతర స్మరణ దానికి సహకారంగా ఆహారనియమం (సమయానుసారం, నేను వండుకున్నది తినటం, చిరుతిండ్లు తినాలనే యావ పోగొట్టటం) సహజసిద్ధం చేయటం జరిగింది. భౌతికంగా ఎన్నో ఇబ్బందులు అనిపించినా చెడిపోయిన తాళబుర్రల రిపేరులా ఎన్నో సంస్కారాలపై సుత్తి దెబ్బలు కొడుతూ అవసరమైనప్పుడు ఎంతో ఊరట కలిగిస్తూ చివరకు మా పెద్దవాడి Ph.D.మంచిగా చేయించారు. మా ఇద్దరు పిల్లల బాధ్యత వారే పూర్తిగా వహించి వారిని చక్కటి జీవిత విధానంలో స్థిరపరిచారు. వివాహ విషయం గానీ ఆరోగ్యం, చదువు, ఉద్యోగం, సంస్కారం, ఇలా అన్నీ మా ఇద్దరు పిల్లలని మలుస్తూ ఇప్పుడు వారిని చక్కటి అధ్యాపక వృత్తిలో సాఫీగా వెళ్లిపోయేలా చేసారు. నాకు కూడా ఆహార నియమం సహజంగా జరుగుతూ ఒక టైం టేబుల్ ప్రకారం పూజ, సత్సంగం, ప్రార్ధనలు ఏ కలతలూ పెద్దగా లేని జీవిత విధానంలో నన్ను మావారిని ఉంచారు. వీటన్నింటికీ అవ్యక్తమైన స్వామి, సాయి, మాస్టర్ ఆశీస్సులనుకున్నా ప్రత్యక్షంగానూ, ప్రత్యేకంగానూ సార్ లెటర్లు, బోధలు, సత్సంగాలు, సాంగత్యం, సూచనలు ఆపై వారి కృప కారణము. కృతజ్ఞతతో శ్రీ సాయినాధుని, స్వామికి ప్రీతికరమైన జీవిత విధానంలో వారి స్మరణలో నిరంతరం గడపగల శక్తినిమ్మని ప్రార్థిస్తూ...

గొర్తి లక్ష్మి


శ్రీ షిర్డీ సాయిబాబా


శ్రీ ఎక్కిరాల భరద్వాజ మాస్టర్


శ్రీ సుబ్బరామయ్య గారు


శ్రీ వెంకయ్యస్వామి


శ్రీ దర్గాస్వామి

## సార్ లెటర్లు

### శ్రీ మాస్టారు చెప్పినట్లు లక్ష్మిగారు సత్ సంగము భజనలు చేసుకుంటూ సదా ఆచరణకు ప్రయత్నిస్తూ ఒక సందర్భములో మాంద్యము గా వున్నప్పుడు సార్ముఖ్యంగా సాధకులలో రావలసిన పరిణితి గూర్చి వివరించిన letter:

గొలగమూడి

పూజ్యులైన లక్ష్మిగారికి శ్రీ సాయిశుని దయవలన నూతన సంవత్సరములో మీకు సర్వశుభములు కలుగవలెనని ప్రార్థన. శ్రీ సాయి అని వ్రాశాను. శ్రీ మాష్టారు, శ్రీ వెంకయ్య స్వామి అని అనేకులు బాహ్య దృష్టికేగాని, అంతర్ దృష్టితో వారంతా ఒక్కటే కదా!

అసలు మీకు అలాంటి నిస్పృహకలగడానికి కారణమేమో బాగా మీరే యోచించండి, మీకే తెలుస్తుంది. నాస్వల్పమైన బుద్ధికి తెలుస్తుంది ఏమంటే మీరీ జన్మలోనే ఏదో సాధించాలని తలచారు. గట్టిగా అది సఫలీకృతం అయ్యేటట్లు లేదని మీ నిరాశ నిస్పృహ. నాలాంటి రోగిష్టి వారికైనా ఉండవచ్చునేమో కానీ,మీకు నిస్పృహ రాకూడదు. వరుసగా 1వ నెల నుండి ఆయాసం చలి విపరీతంగా ఉంది. ఇదే సమయంలో మిగిలిన ఇద్దరూ పూజారులకు అనారోగ్యమై మంచం పట్టారు. నేను ఎందరు చెప్పినా వినకుండా రాత్రి 2 గంటలకు లేచి పోతున్నాను. ఆ కాలంలో మాత్రలు మింగే పోతున్నాను. కానీ 2వ తేది రాత్రి బాత్‌రూములో నుండి ఇంట్లోకి రాలేకపోయాను. అంత తీవ్రమైన ఆయాసం 2 గంటల 35 నిమిషాల వరకూ ఏమీ తగ్గలేదు. 1/2 మాత్రబదులు 3 మాత్రలు మింగాను. ఇక లాభంలేదని మరొకరిని పంపాను పూజకి. ఇంతటి బాధలో కూడా సంతోషంగా ఉంది ఎందుకు? నా ప్రారబ్ధాన్ని త్వరగా కడిగేస్తున్నారు, శ్రీ స్వామి అని. నెమ్మదిగా (స్లోగా) తీర్చేకంటే ఇది మంచిది కదా! నాకు అంతటి బాధలో కూడా నిరాశ, నిస్పృహ ఎందుకోగానీ కలుగలేదు. నేనొక మొద్దునో ఏమో తెలియదు.

నాకు తెలిసింది ఒక్కటే. జీవిత కళ తెలుసుకుని సంతోషంగా స్వామిని స్మరిస్తూ జీవించి ఆయన ఈ డ్రామా సీను నుండి నైదొలగమ్మన్నదాకా నవ్వుతూ, నవ్విస్తూ ఉండడమే. సాధన ఎలా చేయాలో ఏమిటో - సాధనంటే ఏమిటో తెలియని వాణ్ణి. ఆయనే తన పాదాల దగ్గరకు తీసారు. ఇక ఆయన ఇష్టం. నన్ను జీవిత పరంపరలలో పడతోస్తాడు, తోయనీ - నా మనసు వారి యందు లగ్నమై ఉంటే ఏ శరీరమైనా బాధలేదు. జన్మరాహిత్యం చేయాలో ఆయన నిర్ణయం - అది నాకు సంబంధించినది కాదు. ఇచ్చిన జన్మలో హాయిగా, సంతోషంగా జీవిస్తూ ఇతరులను సంతోషపెడుతుండడమే నా ధ్యేయం. అంతకంటే నాకేమీ తెలియదు. తెలుసుకోవాలనే బుద్ధీ లేదు.

02-01-2000 రాత్రి అంతటి బాధలో నాకొక తీవ్రమైన నిర్ణయం స్థిరంగా హృదయగతమైంది. ఇంతటి బాధలో ఈ ప్రపంచంలో ఎవరు మనలను ఆదుకోగలరు. ఒక్క శ్రీ స్వామి వారు మాత్రమే. ఇంతకు ముందు 1 నెల రోజులుగా అన్నం నిద్రలేని నాకు ఒక్క నిమిషంలో వారి సన్నిధి చేరగానే ఘాడంగా నిద్ర పట్టింది, 8 గంటల సేపు. తెల్లవారి అన్నీ సుష్టుగా తిన్నాను. అలా 15 రోజులు జరిగింది. ఆ తర్వాత 83 వ సంవత్సరంలో ఇదే తంతు జరిగింది. అనారోగ్యంతో మద్రాసు పోవాలని ముందు శ్రీ స్వామివారి సమాధికి నమస్కరించాలని బస్సు ఎక్కగానే నా బాధలు మటుమాయ మయ్యాయి. మరి అలా ఆదుకున్న స్వామి ఇపుడు ఈ బాధలకు గురిచేశారు. మన మంచికే ప్రారబ్ధం కడిగేస్తున్నారన్న బాధలో నవ్వుతున్నాను. మావాళ్ళు నవ్వుతావేమిటి? అంటుంది. ఆమె బాధ పిచ్చి కూడా వచ్చిందేమోనని ఆమె భయం. అలాంటిదేమీ లేదు. అందువలన పుస్తక పఠనం కూడా నిలిపేశాను. నిరంతరం హాయిగా నామస్మరణ ఒక్కటే చేస్తున్నాను. పుస్తకాలు చదివి నాకు చాలా తెలుసుననే సాత్వికాహంకారం నాలో పెరుగుతుంది. అందుకే శ్రీ స్వామి వారు నా మనసును అలా మళ్ళించారని భావించాను. పుస్తకాలు చదివి ఏమి తెలుసుకోవాలి?

"ధ్యానం, స్వధర్మో, నియమోయమశ్చ శృతంచ శాస్త్రాణి సద్వ్రతాని సర్వే మనో నిగ్రహ లక్షణాంతాహ" అన్నారు.

కనుక ఇంకేమీ వద్దు. నిరంతర స్మరణే చేయాలని గట్టి నిశ్చయం కల్పించారు. ఇంతకూ చెప్పవచ్చేదేమిటంటే అంతటి బాధలో కూడా నాకు నిస్పృహ కలగలేదు. ప్రారబ్ధం కడిగేస్తున్నారని ఆనందం మాత్రమే.

మీ లెటరులో ఇహ పరాలు చెడి అని వ్రాశారు. పరం సంగతి మనకు తెలియదు. ఇహంలో మీరేమీ పోగొట్టుకోలేదని నా భావన. రత్నాలంటి ఇద్దరు బిడ్డలు, అనుకూలమైన భర్త, ఆత్మీయులైన స్నేహితులు. మీద్వారా అనేకుల జీవితాల్లో ఆనందం విరుస్తుంది. ఇలాంటి మీకు నిస్పృహ ఎందుకు కలిగిందో తెలియడంలేదు? మనం సాయి నుంచి గాని, సాధన ద్వారాగాని ఏమి కోరాలి? నాకు తెలిసింది తృప్తి, శాంతి. అవి మీకు సంపూర్ణంగా లభించాయని నేను తలచాను. కానీ మీరెందుకిలా వ్రాస్తున్నారో తెలియడం లేదు. ఎప్పుడూ రోగంతో పోరాడే నేను అసంతృప్తిగా, అశాంతిగా ఉండవచ్చుగానీ మీరెందు కిలా వ్రాస్తున్నారో ఆశ్చర్యంగా ఉంది? సాయిని ఆశ్రయించాక ఇక చింతకు తావే లేదు. ఆయన తనకివ్వబడిన ప్రతి పైసాను భగవంతునకు ఒప్పచెప్పి తీరాలని ప్రతిజ్ఞ చేశారు. మరి మనలను గమ్యం చేర్చరా? వారి చేతులలో పడడమే మన అదృష్టం. ఇక మనం వారి చేతులలో నుండి తప్పుకొనే తప్పు కోలేము. "నా జీవితం" అని వ్రాశారు. మనకు ఒక జీవితం అంటూ వేరే లేదు. అంతా ఆయనదే. అంతా ఆయనే అయితే ఇక మనము అనేది ఏముంది. మీ జీవితాన్ని ఆయన ఎప్పుడో కబళించారు. "ఇక సంపూర్ణ శరణాగతిలో మీరాయన సంకల్పానికి దాసులుకాక తప్పదు". అట్టి సంపూర్ణ శరణాగతికి ప్రథమ గుర్తు తృప్తి, శాంతి. అవి మీకు విస్తారంగా ఉన్నా మీరేదో వ్రాసారు ఎందుకు? నా పెన్ను కదిలించాలని మాత్రమే.

నిత్య సత్‌సంగాలు చేయనిదే మనం గమ్యం చేరలేము. పదిమందిలో తిరిగితేనే మనం చక్కని మార్గంలో ఉండగల మంటారు శ్రీ మాష్టారు. తప్పని సరిగా శ్రీ మాష్టారి ఆదేశము, కోరిక అని సంతోషంగా వారి కోరిక తీరుస్తున్నామనే తృప్తిగా సత్‌సంగాలు మనమంతా చేస్తుంటే మనం వారికి శరణాగతి చెందినట్లు అవుతుంది.









స్వధర్మ పాలన ఎట్లాగా? మనం ఆఫీసులో ఉన్నా, ఇంట్లో ఉన్నా, వ్యాపారంలో ఉన్నా, చేతి వృత్తులలో ఉన్నా మనకిచ్చిన పని క్షుణ్ణంగా సక్రమంగా నెరవేర్చడమే కదా! ఆశావ్యామోహాలను దరికి రానీయకుండా, మన ధర్మం ప్రకారం మనం నెరవేర్చడమే దైవారాధన. పండరీభాయి పిడకలేరలేదా? సక్కుభాయి ఇంటిపనులన్నీ చేసింది కదా!

త్వమేవ మాతాచ, పితాత్వమేవ అన్న శ్లోకంలో చెప్పబడ్డదాన్ని ఆచరించడమే. ఇంట్లో అందరి రూపాలలో ఆయనే ఉన్నారు. వాళ్ళందరి ఎడల మన ధర్మం మనమాచ రించాలి. ఇంట్లో ముసలి వారుంటే మీ చావు మీరు చావండి నేను దేవళానికి పోతానంటే ఎలాగండీ - సాయి అంగీకరిస్తారా! కుక్క, పిల్లిని నేనేనని చెప్పిన సాయి ఈ ముసలి వారిలో కూడా ఉండరా? ప్రతి ఒక్కటి దాని స్థానంలో అది గొప్పదే అంటారు. Each is great in its own place. ఎప్పుడు అది, అలా అవుతుంది? దారి స్థానంలో అది తన పని సక్రమంగా నిర్వర్తించినప్పుడు, అది దాని స్థానంలో గొప్పదే.

ఒక నట్టు మనం బిగించిన చోట దాని తెడ్డుపోయి ఊగులాడుతూ తన స్థాయిలో ఉంటే సరిపోతుందా, ఆ నట్టు అక్కడ తాను చేయవలసిన పని చేయాలి కదా! అదే స్వధర్మ పాలన. మిగతా విషయాలు ఎవరికి వారు సాయినడిగితే చెపుతారు.

ఏ పని చేస్తున్నా మన మనసులో అన్యచింతలు ప్రవేశించకుండా మానసిక నామస్మరణ చేయడం మీద మనసు నిలపడమే సాధన. కూరగాయలకని పోతున్నాము. దోవంతా నామస్మరణ చేస్తున్నామా? మందిరానికి వస్తూ పోతూ ఉన్నాము, ఏమారకుండా నామస్మరణ జరుగుతుందా? ఇది అన్ని వేళలా చూసుకోవడమే సాధన. అలా జరగకుండా (నామం) ఆలోచనల వైపు ఎందుకు పోతుంది? రాగము, ద్వేషము, అసూయాది భావాల కారణాలు. వాటిని వివేక, విచారాలతో నిర్మూలించు కోవడమే సాధన. దీనినే మిలారేపాగారు సులువెరిగి సాధన చేయమంటారు.

ఈ ప్రపంచంలో సాయి తప్ప మిగిలినవేవీ (కీర్తి, ధనం) (ఎవరూ) మనలను కష్టాలలో ఆదుకోలేరు. అనేది గట్టిగా హృదయగతం కావాలి. ఎవరినుండైనా మనకు సహాయమందితే దానికి మూలకారణం "సాయి అనే చైతన్య శక్తి" మాత్రమే. మనం ఆ సహాయమందించిన మనిషిలోని సాయి చైతన్యానికి కృతజ్ఞులమై ఉండడమే మనం ఆ మనిషినే కారణంగా గుర్తిస్తాము కానీ సాయిని మరచిపోతాము. అలా మరచిపోకుండా ఉండడమే సాధన. 01-01-1995 శ్రీ మాస్టారు పత్రికలో వ్రాసినది అక్షరాల పై పేరాగ్రాఫులో నేను వ్రాసిన దాని భావమే. సాధకుని హృదయంలో మొదట జరుగవలసినది సంస్కరణ అన్నారు. సంస్కరణ అంటే మార్పుగదా! మనకు తారసపడ్డ వ్యక్తి కాకుండా ఆ వ్యక్తిని నడిపించే సాయి చైతన్యం మీద మనసు కేంద్రీకరించడం. ఇది ఉన్నపళంగా అబ్బదు. నిరంతరం నామస్మరణ చేస్తూ ఎవరి మనసును వారు అనుక్షణం చెక్ చేసుకుంటూ, కాస్త మనసు తన ఆలోచనా స్రవంతి అనే వేగాన్ని తగ్గించుకుంటే తప్ప అందరిలో చైతన్యం వైపు దృష్టి నిలువదు. అన్నం తినినంత సేపు స్మరణ చేయలేని మనసులకు అంతటా ఉన్న చైతన్యం మీద మనసు నిలపటం ఎలా సాధ్యం అవుతుంది?

మనం చేయడమంటూ ఏమీ లేదు. మొదట కాస్త మనసు యొక్క తీవ్ర వేగాన్ని నిగ్రహిస్తే ఆ తర్వాత అంతా సాయియే సమకూరుస్తారు. సంఖ్యాపరమయిన పారాయణలు కాకుండ పరాయణత చెందిప చేసే పారాయణ ప్రతి నిమిషం నామస్మరణ, పారాయణ చేశాక తర్కించుకొని ఈ లీల ఎందుకు చేశారు అని నోట్సు వ్రాసుకోవడం చేస్తుంటే సర్వం సమకూరుతుంది.

పెసల సుబ్బరామయ్య



శ్రీ షిర్డీ సాయిబాబా



శ్రీ ఎక్కిరాల భరద్వాజ మాస్టర్



శ్రీ సుబ్బరామయ్య గారు



శ్రీ వెంకయ్యస్వామి



శ్రీ దర్గాస్వామి

## చాల సంవత్సరాలు సత్సంగం చేసిన తరువాత ఒక సందర్భములో అహంకారం వస్తోందనిపించి సత్సంగంలో మాట్లాడకూడదు అనుకున్న సమయంలో స్వామి సేవగా ఎలా చేయాలో వివరించిన letter:

గొలగమూడి

పూజ్యులైన లక్ష్మిగారికి పె.సుబ్బరామయ్య నమస్కారములు. మీరు పెద్ద పెద్ద మాటలుతో నన్ను సంబోధించడం మానమని ప్రార్థిస్తున్నాను. సాయి స్వరూపులని ఓంగోలు వారు శ్రీ బషీర్ బాబాగారిని సంబోధించారు. ఆరోజే శ్రీ బషీర్ బాబా గారి ఎదుట వారిని మనం అట్లా సంబోధించడం తప్పని శ్రీ మాష్టారు గారు చెప్పారు. ఇక 3 గం||లకు పైగా సత్సంగం వలె కాలక్షేపం జరిగింది. శ్రీ బషీర్ బాబా గారు కుర్చీలో కూర్చోనుంటే మాష్టారు గారు నేలపై పరచిన చినిగిపోయిన టార్పాలిన్ పై ఆశీనులై తన వాదన సాగించారు. ఆ వాదనవిన్న విజ్ఞులకు, గట్టి సాధకులకు వీనులవిందైన పండుగైంది. బాబా వెళ్ళేటప్పుడు శ్రీ మాష్టారు కనీసం నమస్కారము కూడా చేయలేదు. అక్కడున్న శ్రోతలలో వారిని కూడా ఒక శ్రోతగా మాత్రమే భావించారు. ఆ సభలో మీరున్నారా? ఉంటే గుర్తు తెచ్చుకోండి. లేకుంటే కావాలంటే మరొక లెటరు వ్రాస్తాను.

మీ లెటరులో గురుభక్తి కలిగి ఉండాలని శిష్య ధర్మాలను వివరించమని అడిగారని తలంచుచున్నారు. గురువు ఎడల భక్తి కలిగి ఉండడము గురుభక్తి. గురువు అంటే పిల్లల చేత సిగరెట్లు తెప్పించుకొని వారిముందే సిగరెట్లు త్రాగేవారు గురువులని భావించడం పొరపాటు. ఇలాంటివే మరెన్నో చేస్తున్నారు ఈ నాటి జీతాల గురువులు. అయితే శ్రీ మాష్టారు కూడా మాచేత సిగరెట్లు తెప్పించుకొని మా ముందే త్రాగేవారు కదా! శ్రీ మాష్టారు ఆచరించి చూపిన దానిలో కోటివంతు కాదు గదా ఇంకా తక్కువ భాగమైన ఆచరించలేని వారిని గురువులని తలచకూడదు. గురువంటే విశ్వచైతన్యమే తానన్న అనుభవజ్ఞానం గల్గిన మహనీయుడు. మన శరీరం పై ఎక్కడ చీమ పాకాడినా మనకు తెలుస్తుంది. అట్లాగే ఈ విశ్వంలో ఎక్కడేమి జరుగుతున్నా వారికి తెలుస్తుంది. అట్లాగే జరిగిపోయినది. ఇక జరుగబోయేది తెలుస్తుంది. మన శరీరం మీది చీమను మనం వదిలించుకోవాలంటే చేతులతో అనేక ప్రయత్నాలు చేయాలి. విశ్వంలో ఎక్కడేమైనా వారి సంకల్పంతో చేయగలవారే నిజమైన గురువులు. గురువులు అజ్ఞానం పోగొడతారట. ఎవరికి పోగొడతారు? నాలాగ తిని నిద్రపోయేవాళ్ళకా? తగిన విధంగా కృషిచేసి వారి కృపను పొందిన వారికి అజ్ఞానం పోగొడుతారు. అంతేగానీ అందరికీ కాదు.

రెండవ పదం - భక్తి. భక్తి అంటే ఏమిటో భగవద్గీతలో ఒక అధ్యాయమంతా అదే పేరుతో చెప్పబడింది. అద్వేష్టాసర్వభూతానీ - నేటి కలికాల వేషాలేగాక ఈ గుణాలు కూడా అలవర్చుకోవాలట. శ్రీ స్వామి వారు, శ్రీ సాయి, శ్రీ మాష్టారు ఈ వేషాలు వేసుకోలేదు. సంపూర్ణమైన భక్తి యోగం అంతా వారి ఆచరణలో తొంగి చూచింది. మనం ఆ భక్తి యోగాన్ని ఆచరిస్తేనే ఆ పదమునకు కొంతైనా న్యాయం చేకూర్చగలుగుతాము. ఈ ఆచరణలో నీవు బికారివి కావద్దు. నీ భావన ముఖ్యం అన్నారు శ్రీ మాష్టారు. గనుక ఎవ్వరూ భయపడ నక్కరలేదు.


శ్రీ షిర్డీ సాయిబాబా


శ్రీ ఎక్కిరాల భరద్వాజ మాస్టర్


శ్రీ సుబ్బరామయ్య గారు


శ్రీ వెంకయ్యస్వామి


శ్రీ దర్గాస్వామి

గనుక నిజమైన గురుతత్వమంటే భగవంతుడేనన్నమాట. ఈ భగవంతుని గూర్చి నిరంతర చింతన చేస్తూ మనసులోనికి చెత్తను చేరనీయకుండా జాగ్రత్తపహిస్తే ఆ విశ్వగురుడు మన మనసులో ఇంతకు మునుపే పేరుకొని యున్న చెత్తను తగల పెట్టేస్తాడు. నిరంతరం పరుగులు పెట్టి ఎక్కడెక్కడ ఉండే చెత్తనంతా పోగేసుకొని తనకు చుట్టుకోకుండా మనసు పరిశుభ్రంగా ఉంచుకోనేందుకు అనంతకోటి మార్గాలలో కొన్ని నమకము, చమకము, పురుషసూక్తము, శ్రీ సూక్తము అనీ సూక్తములు కొన్ని పూజ, స్తోత్రములు, పారాయణ, నామస్మరణ, ధ్యానం. ఇవన్నీ ఏమి చెపుతున్నాయి? ఇవన్నీ అందుగలడిందు లేడని సందేహము వలదు అన్న ప్రహ్లాదుని వాక్యానికి ప్రతిరూపాలు. అష్టోత్తరమైనా శతనామాలైనా ఆ విశ్వచైతన్యాన్ని వివరిస్తూ, వర్ణిస్తూ ఉంటాయి.

నిర్గుణం, నిష్కలం, నిత్యం, నిర్వికల్పం, నిరంజనం అనే ఆ విశ్వ గురుని అర్థంతో భావన చేస్తూ మనసును నిర్బంధించకుండా కదిలించడమే. కదలికే లేకుంటే గట్టెక్కామన్న మాటే. బోటు రాయి మీద అద్దం పెట్టి చూడడమంటే ఇదేనని శ్రీ మాస్టారు చెప్పేవారు. గనుక గురువంటే విశ్వచైతన్యమని భక్తింటే భక్తియోగ ఆచరణని తెలుసుకొని క్రమంగా అభ్యాసం చేయడమే. అలాంటి అభ్యాసానికి సత్సంగం, సద్గ్రంధపటన ఎంతో ముఖ్యము. సత్సంగంలో మాట్లాడడం బాబా మనకిచ్చిన పని. దాన్ని చక్కగా నిర్వర్తించి బాబా గారిని మెప్పించాలి. అప్పుడే మనం "మీరెక్కడుంటే అక్కడ సత్సంగం చేయండి అదేనాకు లక్షలిచ్చినట్లు" అన్న శ్రీ మాస్టారి మాటనుమనం ఆచరించినట్లవుతుంది. నాకు వ్రాసేపని ఇచ్చారు. మీకు చెప్పేపని ఇచ్చారు. వాటిని మనం సక్రమంగా చేయడమే మన డ్యూటీ. అదే గురుభక్తి. నాకు గర్వమొస్తుందేమో నేను ఆ పని చేయనులేబ్బా అనడం గురుభక్తి అవుతుందా, గర్వం మనలో చేరకుండా చూచుకోవాలి. అది ఎవరికి వారే చూచుకోవాలి. ఎదుటి వారు ఏమన్నా మనకు లెక్కలేదు.

మాష్టారు చాలా గర్విష్టి అన్నవారు లేకుండా పోలేదు, నాముందే అన్నారు. అసలు గర్వమంటే ఏమిటో ఆ అన్నవారికి తెలిసి చావదాయె! మనమేమి చేస్తాం. బషీర్ బాబా గారిని కుర్చీలో కూర్చో బెట్టి తాను చాపపై కూర్చున్నారే అదే వారి ఆచరణలోని గర్వరాహిత్యం.

ఒంగోలులో గాలి శేషగిరిరావుగారు ఉపన్యసిస్తుంటే మాష్టారిని బలవంతం మీద కుర్చీలో కూర్చోబెడితే కాదనక కూర్చున్నారు. కానీ తనకు సుఖంగా ఉందని అందరితో పాటు నేలపై కూర్చున్నారు, ఆ తర్వాత. శ్రీ గాలి శేషగిరిరావు గారు చాలా గొప్ప వక్త. వేలమందిని మంత్ర ముగ్ధులను చేసే వాగ్ధాటి. అలాంటి మహనీయుడు శ్రీ మాష్టారి పాదములకు నమస్కరించి మేము వాచస్పతులము మీరు అనుభవైక వేద్యులు, అని వారి పుట్టినరోజు పండుగ సభలో శ్రీ మాష్టారి పాదములకు నమస్కరించారు.

ఇట్లాగే అహంకార మంటే ఏమిటో నిరహంకారమంటే ఏమిటో వారి దగ్గరే నేర్చుకోవాలి. అవసరమైనపుడు నిర్భయంగా తగిన సమాధానం చెప్పాలిగానీ అవతలివారు అహంకారమను కొంటారని మాట్లాడకుండా ఉండకూడదు. ఒక అధికారితో "నేను చక్కగా నా డ్యూటీ చేస్తున్నానో లేదో నిర్ణయించే అధికారం బాబాకొక్కరికే ఉంది", అన్నమాట. వారి నోటిగుండా వచ్చినప్పుడు - ఈయన చాలా గర్విష్టి అని ఆ ఆఫీసరు అనుకుంటే నష్టమేమొంది. అలా అనరనుకో (శ్రీ మాష్టారు అన్నమాట) అప్పుడు మాష్టారు ఆ ఆఫీసరుకు భయపడ్డట్లే మరి. అభయా సత్వ సంసుద్ధి: అన్న గీతా వాక్యము ఆచరించినట్లు అవుతుందా? అభయం అంటే భయంలేకుండా ఉండుట గదా! గనుక గర్వం మనకు ఉందో లేదో బాబాకు తెలుసు. సత్సంగంలో ప్రతి విషయము వివరించుకోవడం చాలా అవసరం. మనం చెప్పేదానిలో సరైన భావం రాకుంటే సత్సంగంలోని ఎవరైనా దానిని సవరించే స్వేచ్ఛ మనం వారికిస్తుండాలి. వారు చెప్పే సద్భావాన్ని మనం తీసుకోగల్గాలి. అలాంటి వారి చర్యకు మనం అభినందించాలి. అది గర్వం లేకుండడ మంటే అని నాభావం, మీరేమంటారు?

దయచేసి నన్ను సాయి స్వరూపులని సంభోదించవద్దని ప్రార్థన.

మనందరిని సాయి అనుగ్రహిం చాలని ప్రార్థన.

నమస్కారములతో
పె.సుబ్బరామయ్య.


శ్రీ షిర్డీ సాయిబాబా


శ్రీ ఎక్కిరాల భరద్వాజ మాస్టర్


శ్రీ సుబ్బరామయ్య గారు


శ్రీ వెంకయ్యస్వామి


శ్రీ దర్గాస్వామి

స్వామి కృప నెల నెల దర్శించుకుంటే సులభంగా కలుగుతుంది అని సార్ చెప్పాక మొదటిసారి దర్శించుకుని ఆహార నియమం లో తేడా వాల్ల అనారోగ్యం అయి, మరల అలా ఇబ్బంది పడలేనని స్వామి నడిగి ఏమిచేయాలో చెప్పమంటే సార్ సమాధానం ఈ letter:

గొలగమూడి
02-02-2001

పూజ్యగురు బంధువులైన శ్రీమతి లక్ష్మక్క గారికి పెసల సుబ్బరామయ్య నమస్కారములు. మీ లెటరు చేరినది, మీ లెటరు చాలా అమాయకంగా ఉంది.

శ్రీ స్వామి వారిని అడిగి నేను మీకు చెప్పడమేమిటమ్మ. ఆ కారుణ్య మూర్తి స్మృతి మాత్ర ప్రసన్నుడుగా అన్నీ జీవులలోను వెలిగి పోతుంటే నాకు చెప్పి మీకు చెప్పకుండా ఉంటారా అమ్మా.

అసలు నన్ను గొలగమూడి రమ్మంటావా ఇక్కడే ఉండమంటావా? అని అడగడం చాలా చాలా హేయమైనమాట. శ్రీ మాష్టారు షిరిడీ వెళ్ళేటప్పుడు గానీ, చీరాల స్వామి వారి దగ్గరకు వెళ్ళేటప్పుడు గానీ, శ్రీ వెంకయ్య స్వామి వారి దగ్గరకు వెళ్ళేటప్పుడు కానీ ఈ విధంగా వారిని అడిగి రమ్మంటేనే పోయ్యారా? వారిని ఆశ్రయించడమంటే అది మన అవసరము. మన శ్రద్ధ, ధ్యేయముపై మనకున్న పరిశుద్ధమైన శ్రద్ధ మాత్రమే. కేవలం పరమలౌకికులు అజ్ఞానులు అలా రమ్మంటావా, వద్దంటావా అని అడుగుతారు.

శ్రీ స్వామి వారి చరిత్రలో వారి నోటిగుండా స్వయంగా చెప్పిన మాటే మరచిపోయారా?

<u>పంట చేను వదలి పరిగ ఏరుకుంటావా?</u>

ఇదే మాటను శ్రీ మాష్టారుగారు మరొక విధంగా చెప్పారు. ఇంట్లో సాధన చేస్తే ఫలితం 1 రూ|| అదే గ్రామంలోని మందిరంలో చేస్తే అదే సాధనకు ఫలితం పది రూపాయలు. కాశీ, శ్రీశైలం, తిరుపతి వంటి పుణ్యక్షేత్రాలలో అదే సాధన చేస్తే ఫలితం వందరూపాయలు, షిరిడి, గొలగమూడి, ఖాండ్వా లాంటి మహనీయుల సమాధుల దగ్గరగానీ శరీరంతో ఉండే మహనీయుల సన్నిధిలో గానీ అదే సాధన చేస్తే వచ్చే ఫలితం అనంతం అని చెప్పారు.

పంట చేను వదలి పరిగి ఏరుకోవడం అంటే అవధూత లీలలో శ్రీ మాష్టారు వ్రాసినదేమిటి?

సద్గురు సన్నిధి పంటచేను సొంతం చేసుకోవడం. పరిగ ఏరుకోవడం అంటే పంటంతా రైతు తీసుకపోయాక క్రింద పడ్డ గింజలు ఏరుకోవడం. ఇంట్లో చేసే సాధన అంత స్వల్ప ఫలితమిస్తుందని చెప్పారు.

గొలగమూడి ప్రయాణం వలన, ఆహార నియమాల ఉల్లంగన వలన ఆరోగ్యంలో తేడా వచ్చిందని అని వ్రాశారు. ఇంట్లోనే ఉంటూ అన్నీ సక్రమంగా జరుగుతుంటే మీకెప్పుడూ అనారోగ్యం రాలేదా? బాగా ఆలోచించుకోండి? రాకన్ మానవు <u>హాని</u>, వృద్ధులు మహాఘోరారణ్యంబునన్ దాగినన్ అన్నారు. హాని అంటే అనారోగ్యమని తీసుకోవాలి. సత్యము కొరకు బాధ పడువారు ధన్యులు, వారు ఓదార్చబడుదురు అన్నారు క్రీస్తు. శ్రీ స్వామి వారి దర్శనార్థం రావడం వల్లనే అలా అనారోగ్యమయిం దంటే చాలా మంచిది. ఎంతో ప్రారబ్దం క్షాళనమైందని అర్థం.

శ్రీ స్వామి వారి దగ్గర కొచ్చి ఆహార నియమాలు ఎందుకు వదులుకోవాలి. మీరు గిన్నెలు మూతలు బాకు గంటెలు బియ్యం, చక్కెర, కాఫీ పొడి తెచ్చుకొని ఇక్కడ నా రూములో వంట చేసుకోవచ్చు. స్టౌవ్వు నేనిస్తా, కిరోసిన్ ఇక్కడ లీటరు ఇరవైరూపాయలు. లేకుంటే అక్కడ నుండి తెచ్చుకోండి.

ప్రయాణంలో ఆహారం ఇంటినుండి పెరుగన్నమో, చపాతీలో తెచ్చుకుంటే సరి. గత 26 సం|| నుండి నేను నా స్టౌవ్వు, గిన్నెలు, బియ్యము, కిరోసిన్ ప్రయాణాలు కొరకు మోసేవాణ్ణి. చిత్తూరుకు స్పాట్ వేల్యుయేషన్ కు పోయినా సరే తీసుకపోయ్యేవాణ్ణి. అక్కడ నేనొక వింత జంతువుగా కనబడేవాణ్ణి ఇతర టీచర్లకు.

శ్రీ మాష్టారు ఒక మాట చెప్పారు. ఏమని.

నీ బ్రతుకు నీవు బ్రతుకు. ఇతరులు ఏమనుకుంటారో నని అందరిలాగ ఉండప్రయత్నించకు. అందరు టీచర్ల మధ్య చక్కగా వండుకు తినేవాణ్ణి. ఎలక్షన్ డ్యూటీకి పోతే ఎట్లా? అక్కడా అంతే.
ఇతరులతో మనకేమిటి పని -

గనుక సద్గురువు అనబడు పురుష సింహము ఎడల అచంచలమైన, స్వచ్ఛమైన, పరిపూర్ణమైన విశ్వాసమొక్కటే మనలోని అహంకారము అనబడు మదించిన ఏనుగును లొంగతీయగలదంటారు శ్రీ మాష్టారు. ఈ మాట ఎక్కడన్నారో ఏ సందర్భంలో అన్నారో నాకు వ్రాయండి.

దైవీ సంపద లక్షణాలలో మొదటి లక్షణమేమిటండీ: దైవీ సంపద్విభాగయోగము అని భగవద్గీతలో ఉంది.

మొదటి లక్షణం అభయం: అభయం సత్వసంశుద్ధిహి దారయోగ వ్యవస్థితి:

సద్గురువు మన బాధలు చూస్తూ ఓర్చుకోగలడా?

మీ బిడ్డకు అనారోగ్యమయితే మానవమాత్రులైన నీకే అంత బాధ ఉంటే పరమకారుణ్యమూర్తియైన శ్రీ దత్త గురునకు ఇంకెంత బాధ ఉండాలో యోచించండి.

భయరహితంగా ఉండేందుకు శ్రీ సాయి లీలామృతంలో కాబూల్‌లోని సాధకుడే తగిన ఉదాహరణ.

శ్రీ దత్తగురుని చిత్తము, హృదయము నిండా నింపుకున్న మీరే అలా భయపడితే నాలాంటి ఇంద్రియలోలుని సంగతేమిటమ్మా.

ఆహార దోషమే ఇలా అనారోగ్యమయిందని అనుకుంటే నేను కూర్చునే రూము శ్రీ మాష్టారు ఆశీనులైన రూము మీరు రాగానే మీకు తాళమిచ్చేస్తాను. మీరు యధేచ్ఛగా వంట చేసుకొని తిని శ్రీ స్వామి వారిని సేవించండి.

నేను శ్రీ స్వామి వారిని అడిగి మీకు వ్రాయడం - చెప్పడం చాలా తప్పు.

<u>**నాకు తెలిసింది నేను వ్రాశాను, క్షమించండి.**</u>

శ్రీ మాష్టారి మంచి మాట - పుస్తకం మొదటిసారి ప్రూఫుదిద్దడం అయిపోయింది. రెండు, మూడు ప్రూఫులు దిద్దడమైతే ప్రింటిగు బైండింగు తర్వాత ఈ పుస్తకం రాగానే ధర్మమూర్తి ప్రెస్‌కు పంపుతాను.

గాజుల విక్రయం శ్రీ శాస్త్రిగారికి చెప్పారా? మీరు వచ్చేటప్పుడు వాటిని ఇలా కైంకర్యము చేసేందుకు వారి అనుమతి తీసుకురావలెను. భర్త నుండి పర్మిషన్ పొందడం అత్యవసరం.

వార్తాలాపం ఫిల్ములు తీస్తున్నారు. 42 వేలు రూపాయలు అడ్వాన్సు మరియు పుస్తకం పంపాను. పని జరుగుతుంది.

శ్రీ శాస్త్రి గారికి నా నమస్కారములు తెలుపండి. శ్రీ నాగేశ్వరరావుగారిని, రాజును అడిగినట్లు చెప్పండి. నాగమణి గారికి లెటరు వ్రాయలని ఉంది. స్వామి వ్రాయిస్తే వ్రాస్తాను.

నమస్కారములతో
పెసల సుబ్బరామయ్య


శ్రీ షిర్డీ సాయిబాబా


శ్రీ ఎక్కిరాల భరద్వాజ మాస్టర్


శ్రీ సుబ్బరామయ్య గారు


శ్రీ వెంకయ్యస్వామి


శ్రీ దర్గాస్వామి

## మద్రాసు వారి పెద్దబ్బాయి P.hD. సమయంలో, అతని అనారోగ్యంగా ఉండి, ఎవ్వరితో సంబంధం లేకుండా 4 సంవత్సరములు వున్నప్పుడు ఎవరు తోడ లేరను కుంటే సార్ సమాధానం :

గొలగమూడి,

18-9-05

పుజ్య గురుబంధువులు అయిన శ్రీమతి లక్ష్మిఅక్కగారికి చిరంజీవికి సాయికి శ్రీ స్వామి వారి ఆశీస్సులు సదా ఉండాలని ప్రార్థిస్తూ వ్రాయడం (p.s.r.). అమ్మా మనకున్నంత మంది అండ, ఆపు, ఆప్తులు, మిత్రులు, బంధువులుమరెవ్వరికి లేరు. ఎందుకిలా చెపుతున్నానంటే ఆ మహనీయుడు మనవాడే అయి ఉండగా అందరు మనవాళ్ళే. మనకెవ్వరూలేరనే భావం మనకు రాకూడదు. ఇప్పుడు మనకవసరం లేదు గనుకే అందరికీ దూరం పెట్టారు. మనగురుదేవుడు ఏ మూరక మన హృదయంలో ఉన్నాడని మనం నిరంతరము ఆయన వైపే చూడాలని వారి ప్రతిరూపాలయిన ఈ ప్రపంచంలోని రూపాలను పట్టించు కోకుండామెలగాలనేదే వారి సంకల్పం గనుక మనలను అందరి నుండి దూరం చేసాడు. నాకు ఒక్క బంధువు లేడు, స్నేహితుడు లేడు. నాకు మాత్రం ఎవ్వరు లేరే అనే భావన లేదు. సాయిమాస్టర్ నిలయంలో తాత నేనిక్కడ ఉండలేను. ఎక్కడికి అయినా వెళ్ళిపోతానని ఆరాధనకు ముందు నెల నుండి నోటీసు ఇచ్చాడు. Ok వెళ్ళండి అన్నాను. మావాళ్ళు ఆయన పోతే ఎట్లా అని గోల పెడుతుంది. నేను అరిగిపోయిన gramphone రికార్డు లాగా ఆయన పోతే మాస్టర్ ఇంకొకర్నితెచ్చిపెడుతాడు. ఆయన పోతే ఎట్లా అనేది మనకెందుకు. సాయిమాస్టర్ నిర్వాహకులు అయిన గురువుగారిది కదా ఆ డ్యూటీ అని చెప్పేవాడిని. అంటే ఆయన మనవాడై ఉండగా వేరే చింత ఎందుకు. మీకు నాకెవ్వరూ లేరనే భావం తీసేసుకోండి. తృప్తి, శాంతి, ఆనందం, హృదయం నిండా నింపుకోండి. అప్పుడు గురుదేవులు ఎంతో సంతోషిస్తాడు. ఆ మహనీయుడు మనకు ఇన్ని అనుభవాలిచ్చి నేను మీతోనే ఉన్నాను. మీకంటే ముందే మీ గురించి ఆలోచించి ప్లాన్ వేసి ఉంచాను అనడానికి ఎన్ని నిదర్శనాలు ఉన్నాయో. బెంగుళూరులో సాయి ఆసుపత్రికి పోతే డాక్టర్ లేక AC రూమ్ లో ఉంచారు. తిరిగి వచ్చారు. అప్పుడు మీరు Bangalore లో లేకుంటే సాయి ఏమయ్యేవాడో. ఆ తర్వాత దర్గా స్వామికి, మీవారికి ఫోన్ అందకుండా చేశారు. మిమ్ములను గొలగమూడి తీసుకువచ్చారు. ఫోనులో అందకుండా చేసింది ఎవరు? అంతా చేసేది ఆ మహనీయుడే. ముందుగానే మిమ్ములను బెంగుళూరులో ఉంచాడు. అదొక్కటి చాలు. ఆయన నిరంతరం మన ప్రక్కన మనకంటే జాగ్రతగా హుషారుగా ఉన్నాడు అనేందుకు నిదర్శన. ఆ మహనీయుడు ఇంతకు ముందు చేసిన మేలు తలంచుకొని ఎప్పుడూ తృప్తి, శాంతి, ఆనందంగా ఉంటే వారికి ప్రీతి పూర్వకంగా ఆయన కొలువు నర్తకులమైన మనం మన పాత్ర పోషించి వారికి ఆనందం కలిగించిన వారము అవుతాము. ఏది చేసినా, ఏది జరుగుతున్నా అందులో మనం చేయవలసిన కర్తవ్యం కుణ్ణంగా చేసి దాని ఫలితం వైపే చూడకుండా ఆనందంగా ఉండమని శ్రీ మాస్టర్ తన ఆచరణ ద్వారా బోధించారు.

శ్రీ స్వామి వారి ఆశీస్సులతో, పెసల సుబ్బరామయ్య


శ్రీ షిర్డీ సాయిబాబా


శ్రీ ఎక్కిరాల భరద్వాజ మాస్టర్


శ్రీ సుబ్బరామయ్య గారు


శ్రీ వెంకయ్యస్వామి


శ్రీ దర్గాస్వామి

**శారీరక అవసరాలకు, చాపల్యాలకు గల వ్యత్యాసం తెలుపుతూ మనం గురు స్మరణ ఎలా చేయాలో వివరిస్తున్న letter:**

om

గొలగమూడి

8 - 9-2005

పూజ్య గురు బంధువులైన శ్రీమతి లక్ష్మక్కగారికి, చి॥ సాయికి శ్రీ స్వామి వారి కృప సదా ఉండాలని ప్రార్థిస్తూ పె.సు. వ్రాయడం.

శ్రీ మాష్టరు గారు చెప్పిన మాటలు ఒక్కొక్కటి గుర్తించి వాటి యొక్క అర్థం ఎంత లోతుగా గొప్పగా ఉందో మనసుకు అందే కొద్దీ వారిపై గౌరవభావం ఎంతగానో పెరుగుతుంది. నాకు ధ్యానం చేసే విధానం చెప్పండి అంటే దానితో ఇప్పుడు నీకేం పని అన్నారు. అదేంటి సార్ అందరికీ చెపుతున్నారు కదా అంటే వాళ్ళంతా గజస్నానం చేస్తారు నీవూ చేస్తావా? అన్నారు. గజ స్నానమంటే ఏనుగు స్నానమని వివరించారు. ఈ విషయాన్ని భగవద్గీత లో ఒక శ్లోకం వర్ణిస్తుంది .

రాగద్వేషవియుక్తైస్తువిషయానింద్రియైశ్చరన్।

ఆత్మవశ్యైర్విధేయాత్మా ప్రసాద మధిగచ్ఛతి.॥2-62శ్లో॥

***రాగము, ద్వేషము, అసూయ, మదమాత్సర్యంబులు ఆదిగా గల సర్వ అంతః శత్రువులు వదిలి , ఇంద్రియములు విషయముల వెంట పరుగిడకుండా ఉన్నప్పుడు ఆత్మజ్ఞానము కలిగి ప్రసాదము లభించును .***

గనుక మనం ధ్యానం చేయడం ముఖ్యముకాదు. రాగ ద్వేషములు, ఇంద్రియ నిగ్రహమే మన ధ్యేయము కావాలి . రాగద్వేషములు లేక ఇంద్రియ నిగ్రహము గల్గినపుడు స్వతస్సిద్ధము గానే మనస్సు ధ్యానస్థమగును. మన ప్రయత్నమే ఉండదు. జరిగే నాటకాన్ని మనం సాక్షిగా చుస్తుండటమే. నాటకంతో తాదాత్మ్యం చెంది రాగాద్వేషాల వలయంలో చిక్కరాదు.

శరీరం అనే బండికి కావలసిన ఇంధనము సప్లైచేయకుండా ఉంటే శరీరము సరిగా పని చేయదు. దానివల్ల కొన్ని క్రొత్త సమస్యలు వస్తాయి. అందుకే ఆధ్యాత్మిక సాధన కత్తిమీద సాధన అన్నారు. ఇంద్రియలోలత లేకుండా శరీర అవసరాలను తీరుస్తుండాలి. ఏమరుపాటులేకుండా ఆ దివ్యపురుషునిస్మరణతో వారికి సమర్పించబడిన ప్రసాదాన్ని స్వీకరిస్తూ – ఋణానుబంధాలు, కర్తవ్యాలు తీరుస్తుంటే గట్టెక్కగలుగుతాము.

శ్రీ స్వామివారి ఆశీస్సులుండాలనిప్రార్థిస్తూ,పె.సు.



శ్రీ షిర్డీ సాయిబాబా



శ్రీ ఎక్కిరాల భరద్వాజ మాస్టర్



శ్రీ సుబ్బరామయ్య గారు



శ్రీ వెంకయ్యస్వామి



శ్రీ దర్గాస్వామి

స్వామి, భగవంతుడు మనకిచ్చిన, ఇస్తున్న అనుభవాలను మననం చేసుకుంటూ వారి చేతులో ఉపకరణలము గాఎలా ఉండాలో, అలాజీవిస్తే ఎలా ఉంటుందో తెలుపు letter:

om

గొలగమూడి

5-8-2005

పూజ్యగురుబంధువులైన శ్రీమతిలక్ష్మక్కగారికి పెసల సుబ్బరామయ్య నమస్కారములు.

అమ్మ మనం ఏదైనా చెయ్యాలన్నా చేయలేము. చేయలేకుండా ఉండాలన్నా ఉండలేము. ఉదాహరణకు నా కొమార్తె అప్పుడు రైల్వేలో షోలాపూర్ ప్రక్కన హుటిగీ అనే స్టేషన్ లో ఫార్మసిస్టుగా పనిచేస్తుంది. అప్పుడే స్టేట్ బ్యాంకులో ఉద్యోగానికి ట్రైనింగ్ కు తిరుపతి రమ్మని ఆర్డరు వచ్చింది. రైల్వే పెద్ద సంస్థ అని, స్టేట్ బ్యాంకు చిన్న సంస్థ అని, స్టేట్ బ్యాంకు లో చేర్పేందుకు నాకిష్టం లేక ఆ ఆర్డరు కాగితం ఆమెకు పంపలేదు. భగవంతుని నిర్ణయం ఆమెను బ్యాంకులో ఉద్యోగం చేయించాలని, గనుక ఆమె పనిచేసే గ్రామంలో ఆ ముందటి రోజు డాక్టరును చంప ప్రయత్నం చేసారు. ఆ రోజు డాక్టరు లేకుండా ఉంటే మా అమ్మాయికి ఆ మర్యాద జరిగి ఉండేదే. అందుకని తెల్లవారి సామాను సర్దుకుని ఇంటికి రాబోతుంది. అదే సమయంలో నేను షిరిడీ పోవాలనే ప్రేరేపణ పెట్టి బ్యాంక్ ఆర్డరు ఊరక చూపెట్టాలని తీసుకుపోయ్యాను. షిరిడీ పొయ్యే మార్గంలో హుటిగీ కనుక అక్కడ దిగి ఆమెను చూచి షిరిడీ పోవాలని దిగాను. ఆమె సామాను సర్దుకుని రెడీగా వచ్చేందుకు సిద్ధంగా ఉంది. విషయం తెలుసుకుని షిరిడీ ప్రయాణం మానుకుని తెల్లవారి 10 గం. లకు తిరుపతి ట్రైనింగ్ లో చేర్చాలని,వెంటనే హుటిగీ నుండి తిరుపతి వచ్చి ట్రైనింగ్ లో చేర్చాను. నా షిరిడీ ప్రయాణం పోయింది.

నేననుకొన్న షిరిడీ యాత్ర సాగలేదు. భగవంతుని నిర్ణయానుసారం ఆమె స్టేట్ బ్యాంకులో ఉద్యోగం అయింది. బ్యాంకు ఉద్యోగినే వివాహమాడి నెల్లూరులో కాపురమున్నారు.

***మనం ఒక పని చేసేందుకు, చేయకుండా ఉండేందుకు స్వేచ్ఛలేనివారము. భగవంతుని చేతిలో ఉపకరణాలము మాత్రమే. ఇది తెలిసి దేనికీ చింత చేయకుండా హాయిగా నీ ఇష్టమొచ్చినట్లు నడుపు తండ్రీ అంటూ సంతోషంగా ఉంటే ఈ నాటకరంగం లో మన పాత్ర బాగా నటించినవారమవుతాము.*** అట్లాగాక అంతా నేనే చేస్తున్నాను, పిల్లలను చెడగొడుతున్నాను అనుకోవడం అవివేకం. చెడగొట్టడం, బాగుపరచడం మన చేతిలో ఏమీలేదు. మా అన్నను చదువు కొరకు నెల్లూరులో మా మేనత్తగారింట్లో ఉంచితే బీడీలు త్రాగేది నేర్చుకుని సాయిబులతో కుస్తీలు పట్టేది నేర్చుకొని చెప్పకుండా ఇంటికి వచ్చేసాడు. ఇక నన్ను చదువుకే నెల్లూరు పంపకూడదనుకొన్నారు. కాని రెండురోజులు పూర్తి నిరాహారదీక్ష చేసి చదువు కొరకు నెల్లూరు వెళ్లి B.Sc., B.Ed అయ్యాను. మనము ఏదీ చేయలేము, చేయకుండా ఉండలేము అంతా దైవమే చేస్తున్నాడు.

శ్రీ స్వామి వారి ఆశీస్సులతో,

పెసల సుబ్బరామయ్య

సాధనకు ఆహార శుద్ధి ఆవశ్యకత ఎంతో అవసరమని శ్రీచెన్నయ్య గారికి శ్రీ భరద్వాజ గారు చెప్పినవి ఇక్కడ పొందు పరచటమైనది

    



# 26. సాధనకు ఆహార శుద్ధి ఆవశ్యకత

*"ఆహార శుద్ధే సత్త్వశుద్ధిః సత్వశుద్ధే ధృవస్మృతిః*
*స్మృతి లభ్యే సర్వగ్రంథినాం విప్రమోక్షః"*

**భావము:** పరిశుద్ధ ఆహారం తీసుకొనడం వల్ల మనస్సు పరిశుద్ధమవుతుంది. జ్ఞాపకశక్తి పెరుగుతుంది. దాంతో మానవునికి సర్వబంధాలనుండి విముక్తి కలిగి మోక్షమార్గంలోనికి తీసుకుని వెలుతుంది. – ఒక మహాత్ముడు.

నేను పత్తికొండ(కర్నూలు జిల్లా) ప్రభుత్వ జూనియర్ కళాశాలలో వృక్ష శాస్త్రోపన్యాసకులుగా పని చేయుచున్న రోజులు. సాధారణంగా మాష్టార్‌గారి దర్శన ఆశీస్సులకొరకు 3-4 నెలలకొకసారి వెళ్ళడం, ఒకటి లేక రెండు రోజులుండి వారి దర్శన ఆశీస్సులు, సాన్నిధ్య భాగ్యం పొందటం పరిపాటి. ప్రతిసారి వెళ్ళినపుడు వారు వేసే ప్రశ్నలు:

అమ్మనాన్న గారు కులాసేనా? అన్నయ్య బాగున్నారా? ధ్యానం బాగుగా జరుగుచున్నదా? బాబా చరిత్ర, శ్రీ గురుచరిత్ర, ఇతర మహాత్ముల చరిత్రలు పారాయణ చేయుచున్నావా? మన 'సాయిబాబా" పత్రిక ఎలా వున్నది? అందులోని "పరిప్రశ్న" అంశమందు ఏకాగ్రతతో చదువుచున్నావా? తరగతి గదిలో నేను చెప్పిన విషయాలు, ఎప్పుడైనా అవకాశమున్నపుడు విద్యార్థులకు చెప్పుచున్నావా? అని.

ఒకసారి దర్శన ఆశీస్సులకొరకు వెళ్ళినపుడు ప్రత్యేకంగా అన్నం ఎక్కడ తింటున్నావు? అని అడిగారు. నేను హోటల్‌లో తింటున్నానని సమాధానం చెప్పడం జరిగింది. వెంటనే మాష్టర్‌గారు "సాధనకు అలాంటి భోజనము ఎలా సరిపోతుంది? అని అన్నారు. నేను మరి ఏమి చేయాలి సార్ అని అన్నాను. వెంటనే మాష్టార్‌గారు సాధకుడు ఎల్లపుడు 'స్వహస్తపాకం' చేసుకోవాలి అని అన్నారు. వంట చేసుకోవడం రాదు కదా! ఏమి చేయాలి అని విన్నవించడం జరిగింది.

అందుకు మాష్టర్‌గారు ఏమండోయ్, పాత్రలో ఒక గ్లాస్ బియ్యం, దానికి తగినన్ని నీరు పోసి, అందులోనే ఆరోజు కూర చేసుకోవాలనుకున్న కూరగాయల ముక్కలు చేసి, అందులోనే వేసి, కారము, పసుపు, ఉప్పు ఇంకా ఏమైనా వేయవలసినవి వేసి ఉడికించి తినడమే కదా అని అన్నారు. అలాంటి స్వహస్తపాకం ఇటు ఆరోగ్యానికి, అటు సాధనకు చక్కగా తోడ్పడుతుందని అన్నారు.

అది సాధ్యమయ్యే పనేనా సార్ అని నవ్వాను. అందులో కష్టము, సాధ్యాసాధ్యాలు ఏమున్నాయి. వేరు వేరుగా తయారు చేసిన పప్పు, కూరలు, రసం, పెరుగు, కంచములో వేసికొని కలిపినపుడు వాటికి ఉనికి ఉండకుండా తిన్నట్లేనని, సాధనకు మనము స్వతహాగా వంట చేసుకున్న ఆహారం చాలా ఉపయోగపడుతుందని, మనస్సు యొక్క చంచలత్వము తగ్గి ధ్యానం బాగుగా కుదురుతుందని చెప్పి ప్రయత్నం చేసి చూడమన్నారు. కారణం ప్రతి మనిషిలో ఒక అయస్కాంత ప్రభావం ఉంటుంది. పాశ్చాత్య పరికరాలు ఇంకా దానిని గుర్తించే స్థాయికి రాలేదు. వంట చేసే మనిషి మనకు తెలియకుండానే తన యొక్క అయస్కాంత ప్రభావాన్ని తాను వండే ఆహారంలోనికి ప్రవేశపెడతారు. ఆ ఆహారం, తినేవారి శరీరంలో చేరి సాధనకు అంతరాయం కలుగజేస్తాయని తెలిపారు.

ఈవిధంగా వంట చేసేవారి యొక్క ప్రభావం, ఆలోచనాసరళి, వారు వండిన వంటపై ఉంటుందని ఒక సంఘటన ఉదాహరణంగా చెప్పుకొచ్చారు. కాశ్మీరం దేశంలో ఒక అవధూత ఉండేవారు. వారు ఎవరు భోజనానికి ఆహ్వానించినా వెళ్ళరు. మాట్లాడరు కూడాను. వారికి ఆకలి వేసినపుడు వారికి బుద్ధి పుట్టిన వారినడిగి ఇస్తే స్వీకరించడం, లేదా వేరొకరిని అడిగి క్షుద్బాధ తీర్చుకునేవారు. ఈ అవధూతగారి విషయం ఆ దేశాన్ని పరిపాలించే రాజుగారికి తెలిసి, అవధూతగారిని దర్శించి, వారికి హృదయపూర్వక నమస్కారాలు తెలియజేసుకుని మిక్కిలి ఆనందించెను. ఒకరోజు రాజుగారు అవధూతగారి దర్శన, ఆశీస్సులు పొందిన తర్వాత, స్వామివారిని ఒక పూట తన ఆతిథ్యము స్వీకరించమని వేడుకొనిరి. స్వామి నుండి ఎటువంటి సమాధానం లేదు. రాజుగారు నిరాశతో వెళ్ళి, తన పట్టు విడువకుండా ప్రతిసారి అవధూతగారి దర్శన, ఆశీస్సులకేతెంచినపుడు స్వామివారిని ఆహ్వానించడం, వారినుండి సానుకూల సమాధానం రాకపోవడం, రాజుగారిని కొంత మనఃస్థాపనకు గురిచేసింది. ఒకరోజు రాజు స్వామి వారితో ఇట్లనిరి. స్వామీ మీకు ఆతిథ్యమిస్తే నేను ఏదో మోక్షము లేక స్వర్గము పొందాలని కాదు. మీకు ఆతిథ్యమునకు అయ్యే ఖర్చు నా ప్రజలనుండి శిస్తు రూపంలో వసూలు చేసిన రాజుగారి ఖజానానుండి ఖర్చు పెట్టడం జరుగుతుంది. తద్వారా నా దేశ ప్రజలందరూ సుఖ సౌఖ్యాలతో, భోగ భాగ్యాలతో, సుభిక్షంగా ఉండాలన్న కాంక్ష తప్ప వేరు ఆలోచన లేదని సవినయంగా విన్నవించారు.ఆమాట రాజుగారి నోటినుండి విన్న వెంటనే అవధూతస్వామివారు రాజుగారి ఆతిథ్యము స్వీకరించుటకు తమ అంగీకారాన్ని తెలియజేశారు.

స్వామివారి అంగీకారాన్ని విన్న రాజుగారు పరమానందంతో, స్వామివారికి ఇచ్చు ఆతిథ్యము ఏర్పాట్లు మంత్రిగారికి అప్పజెప్పడం జరిగింది. ఆతిథ్యం రోజు రానే వచ్చింది. అవధూతస్వామివారు రాజప్రసాదమునకేతెంచి,

86

రాజుగారు ఇచ్చిన ఆతిథ్యము స్వీకరించి వెళ్ళిపోయారు. రాజప్రసాద ఆచారం ప్రకారం విందు ముగిసిన వెంటనే విందుకు ఉపయోగించిన బంగారు, వెండి పాత్రలు లెక్కించడం ఆనవాయితీ. అట్లు లెక్కించినపుడు ఒక బంగారు చంచా (స్పూన్) తక్కువ వచ్చింది. రాజుగారువెంటనే అవధూతస్వామివారి దగ్గరకు వెళ్ళి ప్రణామాలు అర్పించి స్వామీ! మీరు కోరుకుంటే నా ఈ సమస్త రాజ్యము మీ పాదాక్రాంతం చేసి ఉండేవాడను కదా! ఒక చిన్న బంగారు చెంచా ఎందుకు దొంగిలించారో కారణం తెలియక చాలా బాధపడుతున్నాను. దొంగిలించుటకు గల కారణం తెలియజేయవలసినదిగా వేడుకున్నారు.

రాజుగారి సంశయానికి సమాధానమిస్తూ, అవధూత స్వామివారు నీ రాజ్యంలో ఒక సామాన్య పౌరుడు ఇలాంటి దొంగతనం చేస్తే ఎలాంటి శిక్ష వేస్తారో, అలాంటి శిక్ష నాకు వేస్తే మీకు సమాధానం చెప్పగలనని తెలిపిరి. ఆ రోజుల్లో అలా దొంగతనం చేసినవారికి, కాలు, చేతులు ఖండించుట వాడుకలో ఉండేది. దాని ప్రకారం అవధూతస్వామి చేయి ఖండించిన తర్వాత స్వామివారు రాజుగారితో "నీవు పెట్టిన కూడు తిన్న తర్వాత నాకు దొంగతనం చేయాలని పించిందని సమాధానమిచ్చెను" ఆ మాట విన్న వెంటనే రాజు గారికి దిమ్మ తిరిగినట్లైంది. వెంటనే రాజుగారు రాజప్రసాదం చేరి, మంత్రిని పిలిపించి, లోపమెక్కడ జరిగిందని విచారించారు. అప్పుడు మంత్రిగారు మీ ఆనతి ప్రకారం అవధూత స్వామివారికి చేసిన ఆతిథ్య ఏర్పాట్లలో దేశ ఖజానానుండియే కాక, తన స్వంత పైకమును కూడా కొంత వినియోగించినట్లు ఋజువైనది. అది విని రాజుగారు ఉద్వేగభరితులై, స్వామివారు, అంతకాలం తన ఆతిథ్యం స్వీకరించుటకు రాని కారణమును తెలిసి మిక్కిలి బాధపడిరి. ఈ విధంగా చెప్పి మాష్టర్‌గారు మనము తినే ఆహారం 1) సాత్వికాహారమై ఉండాలి 2) న్యాయార్జితమై ఉండాలి. 3) మితాహారమై ఉండాలి. 4) దైవార్పిత ఆహారమై ఉండాలి. లేనియెడల సాధన సవ్యంగా జరుగదని, వంట మొదలు పెట్టమని ఆదేశించిరి. వారి ఆదేశానుసారం వంట మొదలు పెట్టి నాకు వచ్చినట్లు చేసుకొని తినడం జరిగింది. అయితే మనం తినే అన్నం ఇంత ప్రభావితం చేస్తుందా అన్న సంశయం చాలా కాలం నన్ను వేధించింది. తర్వాత కాలంలో సద్గ్రంథ పఠనం చేయుచున్నపుడు వివిధ సందర్భాలలో ఆహారం గురించి, మనం తీసుకునే ఆహారం మన మనస్సును తీవ్రంగా ప్రభావితం చేస్తుందని తెలియ వచ్చింది.

మహాత్మాగాంధీగారు యార్వాడ జైలులో ఉన్నపుడు వారికి విపరీతమైన ఆలోచనలు అనగా ఎదుటివారిని చంపాలని జైలుగోడలు ఎక్కి పారి పోదామని, ఎవ్వరితో అంటే వారితో పోట్లాడాలనే భావనలు వచ్చేవి. ఆయన ఎందుకు

87

ఇంత తీవ్రమైన ఆలోచనలు కలుగుచున్నవని ఆలోచిస్తూ, వంట ఎవరు చేస్తున్నారని విచారించారు. ఆరునెలలలో ఉరిశిక్ష విధించబడిన వ్యక్తి వంట చేస్తున్నాడని తెలిసింది. దీనిని బట్టి వంటచేసే సమయం, ఆ వంటమనిషి మనస్సులోగల భావాలు (అయస్కాంత ప్రభావంవలన) తను వండే ఆహారమును ప్రభావితం చేస్తాయని తెలుస్తున్నది.

భారతయుద్ధానంతరం ధర్మరాజుకు ధర్మప్రబోధం చేస్తూ భీష్మాచార్యులు అంటారు, ఆనాడు కౌరవులు నిండుసభలో ద్రౌపదిని అవమానించే సమయంలో, కౌరవుల అన్నం తినుటవలన ఏర్పడిన రక్తము నా శరీరమునందు స్రవించుచున్నందున ధర్మము గూర్చి మాట్లాడకపోయాను. ఇపుడదంతా, భారత యుద్ధములో అర్జునుని బాణము వలన ఏర్పడిన గాయములనుండి అధర్మపు టన్నము వలన వచ్చిన రక్తము అంతయు కారిపోయినది. కనుక ఇప్పుడు నేను ధర్మము గూర్చి మాట్లాడుచున్నానని సమాధానమిస్తారు.

ఈ విషయాలు అన్ని తెలిసిన తర్వాత, ఎందుకు ఎవరికి వారు వంట చేసుకొని తినవలయుననే విషయము తెలిసింది. శ్రీ పాకలపాటి గురువుగారు ఒక సందర్భంలో వంట రాని మగవాడు మగవాడే కాదు అన్న విషయము ఎక్కడో విన్నట్లు గుర్తు. కనుక మనము తినే ఆహారము సాధకుడినెలా ప్రభావితం చేస్తుందన్నది మనకు మాష్టర్‌గారు తెలియపరిచారు. మాష్టర్‌గారు పాదపద్మాలకు హృదయపూర్వక నమోవాకములు.

- డా॥ ఇ. చెన్నయ్య, రిటైర్డ్ ప్రిన్సిపాల్, తిరుపతి

## సంపాదకీయం : **నియమ పాలన – విశేష ప్రయత్న శీలత**

శ్రీ మాస్టారు ధ్యానయోగసర్వస్వంలో నియమపాలన యొక్క ప్రాముఖ్యం వివరిస్తూ మాస్టారు, "నియమం, నిగ్రహం లేని మనస్సు నీటి ఆవిరిలా ఒకచోట స్థిరంగా ఉండదని, పులి విస్తరాకులాగ ఎటు గాలి వీస్తే అటు తిరుగుతూ సంతృప్తి లేకుండా అస్థిమితంగా ఉంటుందని, అన్నిచోట్ల చెత్తను చేరవేసుకుని మరింత చింతకు గురి అవుతూ, ఇతరులను కూడా గురి చేస్తూ ఉంటుందని, అట్టి మనస్సును సద్గ్రంధ పఠనం, సత్సాంగత్యం, సద్గురు సన్నిధి, స్మరణ, నియమపాలన మొదలగువానిని శ్రద్ధగా ప్రయత్నపూర్వకముగా ఆచరించడంద్వారా మాత్రమే నీటి ఆవిరినుండి కొంత చంచలం తగ్గిన నీటి లాగాను, ఎక్కువకాలం ఈ విధమైన నియమబద్ధమైన సమయ పాలనతో కూడిన జీవిత విధానము, సద్గురు కృప తోడు కావడంవల్ల మాత్రమే మంచులాంటి ఘనీభవించిన మానసిక స్థిరత్వము, చెదరని శాంతి, చైతన్య ఘనత, ఆత్మతృప్తి లేదా సంపూర్ణ శరణాగతి లభ్యమవుతుందని" వివరిస్తారు.

అలాసే పరిప్రశ్నలో, ప్రాతః కాలంనుండి నిదురించేవరకు సాధకులు ఎలా గడపాలసే ది వివరిస్తూ, చక్కటి సమయపాలనతో కూడిన (time table ప్రకారం) భగవంతుని స్మరణ, ధర్మ బద్ధంగా మన కర్తవ్యం నిర్వర్తించాలని చెబుతూ, ఇలా శ్రద్ధతో ఆచరించేవారికి సహజంగా ఇంద్రియ మనో నిగ్రహానికి కూడా దారితీస్తుందని చెబుతారు. మాష్టారి ఈ బోధలు సత్

సాంగత్యానికి, ధర్మాచరణకు తోడు నియమ పాలన, సమయాన్ని సద్వినియోగం చేసుకునేలా నిర్ణీత దైనందిన కార్యక్రమము సాధనలో ఎంతటి ప్రముఖ్యాన్ని కలిగివున్నాయో తెలుపుతాయి. శ్రీ సాయినాథ పూజలో నైవేద్యాన్ని సమర్పించే విధానం, ఆరతి ప్రాముఖ్యత వివరిస్తూ, తినే పదార్ధాలపై చూసేవారి సంస్కారాలు సైతం ఎలా ప్రభావితం చేస్తాయో తెలుపుతారు.

శ్రీ చెన్నయ్య గారి కి మాస్టారి తొ గల పై  అనుభవం రీత్యా శ్రీ భరద్వాజ మాస్టారు ఆహర నియమంకూడా ఎంత ముఖ్యమో వివరించిన వివరణ శ్రీ వెంకయ్యస్వామివారి ఆచరణలోనూ, శ్రీ సుబ్బరామయ్యసార్ అనుభవంలోనూ ప్రత్యక్షంగా వ్యక్తమవుతోంది. అట్టి ఆహార శుద్ధిలో ధర్మాచరణ తొ కూడిన సముపార్జన కూడా ముఖ్య భాగమని శ్రీ మాస్టారు, సార్ ఆచరణలు బోధలు తెలుపుతున్నాయి. శ్రీ స్వామివారి వంటి మహాత్ముల సూచనలను మాటలను ఎంత శ్రద్ధగా ఆచరించాలో, ఆచరిస్తే ఎంతటి ఉన్నతి మేలు జరుగుతుందో సార్ జీవిత విధానము, ఆజన్మాంతము ఆచరించి బోధించిన నియమ పాలనలో తెలుస్తుంది. శ్రీ సార్ స్వామి మౌన బోధను అనుసరించేటట్లు ఎలా తీర్చిదిద్దుకున్నారో ఇచ్చట చూద్దాము.

సార్ శ్రీ మాస్టారి సాంగత్యానికి ప్రభావితమై, వారి మాటను అనుసరించి స్వామి వారి దగ్గరకు వెళ్ళటం, స్వామి సార్ మనస్సులోని పవిత్ర కోరికలను తీర్చి సర్వజ్ఞులనే అనుభవాన్ని, వారి సేవను కూడా ప్రసాదించటం జరిగిన మొదటి రోజులలోనే "చమురు లేకుండా కాల్చు" అని స్వప్న సందేశం ఇచ్చారు. స్వామిని భౌతికంగా దానిని గూర్చి అడిగితే మౌనం వహించారు. సార్ స్వామే తెలియచేస్తారని ఊరుకున్నారు. తర్వాత క్రమంగా సార్ కు చమురు పదార్ధాలు తింటే ఆయాసం ఎక్కువ వస్తోంది అన్న ఎరుక కలిగింది. అందుచే నూనె పదార్ధాలు మాని వేసారు.

అలాగే సాయినాధుడు కలలో ఉప్పు, పులుపు, కారం లేకుండా ఉండగలవా అని అడిగారు. నిజానికి వీనిలో ఏవో రెండు చెప్పారట.  శ్రీ మాస్టారిని అడిగితే "మూడు మానేస్తే ముదనష్టం పోలే" అన్నారు. చిత్రమైన ఈ సందేశానికి వెరవక సంతోషంగా ఉప్పు, పులుపు, కారం, నూనె మాని కేవలం శారీరక శక్తికి అవసరమైన చక్కర ఆహారంలో వాడేవారు.

ఇంకో సందర్భంలో స్వామి వద్ద ఉంటూ స్వామికి  సేవ చేస్తూ కొన్నాళ్ళు సార్ ఉందామని స్వామి అనుమతి అడిగితే "ఆయన అన్నం ఆయన తింటూ ఉండమను" అని చెప్పారు. "ఎందుకు స్వామి ? మనం వండుతుండ్ల, ఇంత మందిమి తింటుండగా ఆయన ఒక్కరు ఎక్కువా" అని సేవకులు అడిగితే "ఆయన బాపనోల్లయ్య, ఆయన తినకూడదు" అన్నారు. "కాదు స్వామి ఆయన వైశ్యులు" అని శిష్యులు అంటే స్వామి మౌనం వహించారు. సార్ కు అప్పటి నుండి వేరే ఊళ్లు వెళ్ళినప్పుడు వాళ్ళ చుట్టాల ఇళ్ళల్లో తిన్నా సరే అనారోగ్యం వచ్చేది అన్న గుర్తింపు కల్గింది. దానిని అనుసరించి అమ్మగారితో (సార్ ధర్మ పత్నితో ) అంటే "ఎందుకు మీరు వాళ్ళ ఇండ్లలో తినేది, ఉదయం బాక్సు పట్టుకు వెళ్లి పని అవ్వకున్నా రాత్రికి వచ్చేయండి" అన్నారు. "మరురోజు కావాలంటే మళ్ళీ వెళ్ళచ్చు అన్నారు".  సార్ ను "స్వయంగా వండుకొని తినమన్న" స్వామి ఆదేశం పాటించేటట్లు స్వామి అనుభవమూ, ఆస్కారము కల్పించారు.

అయితే ఈ నియమ పాలన స్వామి ఆదేశం లేదా భగవంతుని ఇష్టము గుర్తించటం ఒక ఎత్తు అయితే దానిని పాటించటం మరెన్నో రెట్లు కష్టం అనే విషయం భగవంతునికి ప్రీతికరంగా కొద్దిగాసైనా జీవించదలచుకున్న వారి కందరకు ఎంతో కొంత







శ్రీ షిర్డీ సాయిబాబా శ్రీ ఎక్కిరాల భరద్వాజ మాస్టర్ శ్రీ సుబ్బరామయ్య గారు శ్రీ వెంకయ్యస్వామి శ్రీ దర్గాస్వామి

అనుభవమే - **ఎన్ని అవాంతరాలు వాటికై అవే పుట్టుకొస్తూ ఉంటాయో, నియమాలను ఎన్ని మార్పులు చేర్పులు చేసుకుంటూ చివరకు ఎంతటి అసంతృప్తి కరమైన ఆచరణతో ముగిస్తామో!** అయితే సార్ వీనిని ఆచరించటంలో వచ్చే ప్రతి అవాంతరాలను సూక్ష్మంగా పరిశీలిస్తూ, ఎంతో శ్రద్ధ, శరణాగతితో సరిదిద్దుకుంటూ స్వామికి ప్రీతికరమైన జీవిత విధానంలో స్థిరమయ్యారో కొద్దిగా చూదాం. సార్ తరచు చెప్పే రీతి Readiness కాదు Complete Readiness లేదా సంసిద్ధత నుండి హృదయపూర్వక సంసిద్ధత మన వద్ద ఉంటే స్వామి ఎలా పాటింప చేస్తారో మరో దారి లేదనే రీతినయిన చేసి ఆ జలగ స్వామి వదలక ఆచరింపచేస్తారో అనుభవ పూర్వకముగా తెలిపారు.

1. చమురు పదార్థాలు తింటే అనారోగ్య మొస్తుందని అవి వదలమని స్వామి ఆదేశమని తెలిసిన తరువాత ఒకసారి Head Master Exam వ్రాయటానికి ఒక ఊరు వెళ్ళి Bakery మీదుగా నడుస్తుండగా అచ్చట గోధుమ పిండి పెద్ద గుట్ట పోసి దానిలో నూనె పోస్తుండటం చూచారు. "ఏమిటది? దేని కిదంతా" అంటే Bakeryలో అన్ని పదార్థాలు దీనితో చేసేవే అని చెప్పారు. రస్కులు, బ్రెడ్ అప్పటి వరకు తినే సార్ ఇంత నునె పదార్థాలు తింటూ "చమురు లేకుండా కాల్చు" అన్న స్వామి మాట పాటిస్తున్నా అనుకుంటున్నానని పశ్చాత్తాపంతో అవి మాని నియమపాలన నుండి కఠోర నియమపాలన వైపు పయనం సాగించారు.
2. అలానే ఒకసారి స్నేహితుని బలవంతంపై అతని బియ్యం వండు కోవటం 3 నెలలు ఆయాసానికి దారి తీసి ఎన్ని వైద్యాలకు లొంగక ఇంక మద్రాసు హాస్పిటల్ కు వెళ్ళాలని, గొలగమూడి దర్శించుకుని వెళదామని వస్తే వెంటనే తగ్గటం మరల బయలుదేరగానే మరల ఆయాసం రాగా సాయంత్రానికి / రాత్రికి స్వామి సన్నిధికి చేరుకుంటానని మాట ఇచ్చి ఆయాసం నుండి విముక్తులయ్యారు. **సద్గురు ఆదేశం పాటించటంలో లోపం కలిగినట్లు అనిపించినా నిజమైన పశ్చాత్తాపం లేదా తగిన శరణాగతి చేస్తే సద్గురువే మనను మరింత సన్నిహితంగా చేసుకొని ఆచరణ ఎలా సులభం చేస్తారో ఈ విషయంలో తెలుస్తుంది.**
3. గొలగమూడి నివాసంలో కానీ, వాలంటరీ రిటైర్మెంట్ మొదలగు వానిలో కానీ స్వామి పై ఎలా ఆధార పడ్డారో స్వామి మౌన బోధను ఎలా అనుసరించారో గురుస్తుతిలో వివరంగా చూడవచ్చు. ఉదాహరణకు "వాలంటరీ రిటైర్‌మెంట్ ఇవ్వటమా వద్దా అని దీక్ష చేసి అడుగుదాము" అనుకున్నప్పుడు ఒకసారి కలలో సార్ "డ్రైవర్ లేకుండా కారు నడుస్తుంటే సార్ సీట్లోకి వెళ్ళి బాలన్స్ చేయలేక చెట్టుకు డీ కొని కారు ఆగటం", అలానే మరోసారి దీక్ష చేయబోతే "బస్సు డ్రైవర్ నిద్ర పోతే సార్ అందరికి ఇబ్బంది అని డ్రైవర్ సీట్లోకి వెళ్ళి బాలన్స్ చేయలేక అకస్మాత్తుగా బ్రేక్ నొక్కి ఆపటం" మొదలగు కలలను అనుసరించి మనస్సును ఇంకా స్వాధీనం చేసుకునే స్థితి కుదరలేదని "స్వామి వాలంటరీ రిటైర్‌మెంట్ ఇవ్వ వద్దు అంటున్నారు" అని సందేశం అనుసరించారు. తరువాత కొద్ది సంవత్సరాలకు కలలో స్వామి సేవకుడు నాగయ్య గారు "Yours request for voluntary retirement has been accepted and your services are terminated", అన్నప్పుడు స్వామి ఆదేశాన్ని



శ్రీ షిర్డీ సాయిబాబా



శ్రీ ఎక్కిరాల భరద్వాజ మాస్టర్



శ్రీ సుబ్బరామయ్య గారు



శ్రీ వెంకయ్యస్వామి



శ్రీ దర్గాస్వామి

చీటీలలో Confirm చేసుకుని వెంటనే వాలంటరీ రిటైర్‌మెంట్ (నవంబర్ లో) ఇచ్చారు. ధర్మా చరణ లోపం చేయకుండా ఫిబ్రవరి వరకు స్కూల్ కు వెళ్లి 10th క్లాసు స్టూడెంట్సు కు జీతం తీసుకోకుండా పాటలు చెప్పి వచ్చారు.

4. “కోనేరు దాటితే గాడిదతో సమానం’ అన్న స్వామి సూచనను గుర్తించి ఆచరించటంలో స్వామి మౌన బోధను అందుకొని చేయి విరిగినప్పుడు, కాలు విరిగినప్పుడు, పక్షవాతం వచ్చినప్పుడు కూడా స్వామి మాటకు కట్టుబడి గొలగమూడి దాటి వెళ్ళలేదు. ఎంతటి ఉన్నత కార్యదీక్షతో శరణాగతి స్థిరమైన జీవిత విధానంలో నెలకొన్నారో గుర్తుంచు కోవాలి.

5. నియమపాలన, ఆచరణలో వచ్చే ఇబ్బందులను ఎంతటి శ్రద్ధతో సరి చేసుకున్నారో కొన్ని ఉదాహరణలు. మిగిలిన ఇంద్రియాలను ధర్మ బద్ధమైన కట్టడంతో నియమించిన సార్ అన్నం తిన్న తరువాత ఇంకా తినాలనే చాపల్యాన్ని పోగొట్టుకోవటానికి అన్నం తరువాత కొద్ది సొంటి, తమలపాకు వాడే వారు. అవి తింటే నాలుక తాత్కాలికంగా మొద్దుబారి “అప్పుడు ఇంకేమీ వెంటనే తినాలి అనిపించదు” అనేవారు. జిహ్వ చాపల్యానికి ఎప్పుడైనా లొంగిన సందర్భములో ఉదాహరణకు “గురుస్తుతి” పుస్తకంలో వివరించిన “లేత బీన్స్ కాయలు అతిగా తిన్న” సందర్భంలో ఆయాసం ఎక్కువ అయితే, సార్ స్వామిని “ఎందుకు ఇంత ఆయాసం పెట్టావు” అని అడగటం, స్వామి “చాపల్యాలు నశించినదే వెయ్యి జన్మలెత్తినా ఇంతే” అన్న సూచన ఇచ్చారు. మరల సార్ “అయితే (నేనలా చేస్తుంటే) నువ్వేమి చేస్తున్నావు” అంటే స్వామి సార్ చేసిన పొరపాట్లను సినిమా రీల్ లో చూపారు. స్వామిపై సార్ కి గల శరణాగతిని, మనకు శ్రద్ధతో కూడిన ఆచరణ సహజ సిద్ధమైతే దానిలో లోటుపాట్లు సద్గురువు ఏరీతి తెలుపుతారో వాని నుండి “సామ, దాన, భేద, దండో పాయాలతో” ఎలా మరలుస్తారో తెలిపితే, శ్రీమాష్టారి / స్వామి ఈ సందేశాన్ని అనుసరించి ప్రాయశ్చిత్తంగా 15 రోజులు మూడు పూటలా జావతోనే ఉండటం మనకు చాపల్యాలను, బలహీనతలను నివారించు కోవటంలో ఉండవలసిన శ్రద్ధ, తీవ్రత తెలుపుతాయి.

6. మరో ముఖ్యమైన సాధన లేదా శిష్యుని లక్షణము చెబుతూ సార్ “శరీరాన్ని కండిషన్ లో స్వామి సేవకు ఎప్పుడు అలర్ట్ గా ఉంచుకోవాలని” చెప్పేవారు. దానికి తగ్గ ఆహారం తీసుకోవటం, విసర్జన అయ్యే విధంగా చూసుకోవటం, శరీరం ACTIVE గా స్వామి సేవకు Readyగా ఉండే విధంగా మొదట్లో ఎండు ద్రాక్ష, ఖర్జూరాలు, అరటిపండ్లు (దాదాపు నెలకు 1000 రూపాయలు ఖర్చు) ఒక పరిశోధనాత్మకంగా పరిశీలిస్తూ తినేవారు. తరువాత సార్ సహ ఉపాధ్యాయుడైన శ్రీ రాజగోపాల్ గారి భార్య వారింట్లో ఉన్న ఆకుకూర ఇచ్చారు. “వినదగు నెవ్వరు చెప్పిన” అన్నట్లు సార్ ఆ ఆకుకూర తినటం మొదలుపెట్టారు. ఆకుకూర తినటం దగ్గర నుండి శరీరం బాగా హుషారుగా ఉండటం గమనించి ప్రతిరోజు ఆకుకూర తినటం అనేది ఒక దశాబ్దం పైన చేసారు అంటే ఏమాత్రం అతిశయోక్తి లేదు. అంతేగాక తర్వాత నుండి ఏనాడూ రుచి కోసం ద్రాక్ష, ఖర్జూరాలు తిన్న దాఖలాలు లేవు. **శరీరాన్ని స్ప్రింగ్ లా యాక్టివ్ గా వుంచుకోవటం చాలా ముఖ్యమని**, లేకుంటే స్వామిపూజలో గగుర్పాటు రాదనీ, పూర్తిగా లగ్నం కాలేమని, చేసే పని shrewd గా చేయలేమని, అతి కొద్ది సమయం లో ఎంతో సంతృప్తికరం గా చేయవలసిన మన కర్తవ్య పాలన అలా జరగదని చెప్పే వారు.



శ్రీ షిర్డీ సాయిబాబా



శ్రీ ఎక్కిరాల భరద్వాజ మాస్టర్



శ్రీ సుబ్బరామయ్య గారు



శ్రీ వెంకయ్యస్వామి



శ్రీ దర్గాస్వామి

ఇలా శ్రద్ధతో, శక్తి నంతా వినియోగించి మనం మన శరీరాన్ని, సత్ సాంగత్యంతో మనస్సును సంస్కరించు కొనుటకు సిద్ధం గా లేకుంటే గురుకృప పొందాలనే మాట వాచా శూరత్వమని అనే వారు. సార్ కార్యదీక్ష, లక్ష్య శుద్ధి మనం మన శరీరాన్ని తగిన రీతి ఉంచుకొని స్వామి సేవ, భగవంతుడు మన కిచ్చిన పని క్షుణ్ణంగా చేయటానికి ఎంత ప్రాముఖ్యం ఉందో, అది లేకుంటే మనం చేసే భక్తి, సాధనం, కర్తవ్యం ఎంతటి మిథ్యా సాధనో తెలుపుతూ హెచ్చరిస్తుంది. ఈ రీతి నియమ పాలన, ధర్మా చరణ, శరీరాన్ని భగవత్ సేవకు ఎప్పుడు సిద్ధమైన రీతి ఉంచుకోవటం ఆచరించే శక్తీ నిచ్చి  కృతార్థులను చేయమని ప్రార్థిద్దాము.

--- ఇట్లు, మీ సాయి

| | | |
|---|---|---|
| 1 | అవధూత లీల – (భగవాన్ శ్రీ వెంకయ్యస్వామి వారి జీవిత చరిత్ర) | 40 రూ॥ |
| 2 | అవధూత లీల (ఇంగ్లీషు) Avadhuta Leela in English | 30 రూ॥ |
| 3 | అవధూత లీల (తమిళం) Avadhuta Leela in Tamil | 50 రూ॥ |
| 4 | అవధూత బోధామృతం - శ్రీ స్వామివారి బోధలు | 15 రూ॥ |
| 5 | శ్రీ స్వామి సన్నిధి – శ్రీ స్వామి వారితో వారి సేవకుల అనుభవాలు | 15 రూ॥ |
| 6 | భగవాన్ శ్రీ వెంకయ్యస్వామి (ఇంగ్లీషు, చిన్నది) Bhagavan Sri Venkayya Swami(small) | 5 రూ॥ |
| 7 | శ్రీ వెంకయ్యస్వామి (తమిళం, చిన్నది) Sri Venkayya Swami in Tamil (Small Book) | 5 రూ॥ |
| 8 | గురుస్తుతి | 7 రూ॥ |
| 9 | చూచి నేర్చుకో | 8 రూ॥ |
| 10 | శ్రీ మాస్టారుగారి బోధామృతం (నాకు తెలిసిన మాస్టారు(1,2భాగములు)-శ్రీ మాస్టారి మంచిమాట) | 40 రూ॥ |
| 11 | శ్రీ ధునివాలాదాదా చరిత్ర | 15 రూ॥ |
| 12 | శ్రీ శివనేశన్ స్వామీజీ దివ్యచరితము | 12 రూ॥ |
| 13 | శ్రీ బార్షి రంగప్పబాబుగారి దివ్యచరితము | 8 రూ॥ |
| 14 | శ్రీమాధవదాసుగారి దివ్యచరిత్ర | 4 రూ॥ |
| 15 | శ్రీ పూండీ స్వామి వారి దివ్యచరిత్ర | 15 రూ॥ |
| 16 | శ్రీ ఉగ్ర దర్గాస్వామి వారి దివ్యచరిత్ర | 5 రూ॥ |
| 17 | శ్రీ నరోహా గారి జీవిత చరిత్ర | 2 రూ॥ |
| 18 | వార్తాలాపము | 150 రూ॥ |
| 19 | దైవం మానుష రూపేణ (దర్గాస్వామి చరిత్ర) | 30 రూ॥ |
| 20 | శ్రీ నాంపల్లిబాబా గారి దివ్యలీలలు | 7 రూ॥ |
| 21 | శ్రీ వెంకయ్యస్వామి ఆరతులు | 5 రూ॥ |
| 22. | శ్రీ శ్రీ శ్రీ వల్ల మస్తాన్‌బాబా గారి దివ్యలీలలు | 4 రూ॥ |

1 రూపాయి పుస్తకములు

1. శ్రీ వెంకయ్యస్వామి పూజ
2. శ్రీ స్వామివారి భజన పాటలు
3. నమ్మలేని నగ్న సత్యాలు
4. నమ్మినవారికి సొమ్ము - నమ్మకుంటే దుమ్ము
5. స్మృతిమాత్ర ప్రసన్నాయ నమః
6. స్మృతి రహిత ప్రసన్నాయ నమః
7. సర్వ సమర్థుడు
8. వెన్నెలపూలు – శ్రీ వెంకయ్యస్వామి దివ్యత్వం
9. దివ్యలీలలు
10. బోధ యజ్ఞాయనమః
11. ధర్మమూర్తి
12. పిలిచిన పలికే దైవం
13. శ్రీ స్వామికృప
14. మౌనబోధ
15. వాళ్ళు వుండేదాన్ని బట్టి కదయ్యా మనముండేది!
16. స్వామి అనుగ్రహము
17. మాష్టరుగారి సత్సంగము
18. అమృత వాక్కులు
19. మృత్యువుపై భువన విజయము
20. శ్రీ భరద్వాజగారితో భక్తుల అనుభవాలు
21. శుద్ధ చైతన్యమే తానైన పూజ్య శ్రీ భరద్వాజ మాష్టారు గారు
22. శ్రీ మాష్టరు చూపిన సాయి మార్గం
23. శ్రీ దర్గాస్వామి వారి చరిత్ర – 2వ భాగము
24. శివుని ఆజ్ఞ
25. శ్రీ మాయి అమ్మ
26. శ్రీ కృష్ణయ్య స్వామి దివ్య చరిత్ర